# ఎన్టీఆర్ సుజలకు పథకానికి 8.5 కోట్ల కేటాయింపు..



కుప్పం, జూన్ 8 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గంలో ఎన్టీఆర్ సుజల పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం 8.5కోట్ల నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో అతిత్వరలోనే కుప్పం ప్రాంత ప్రజలకు ఎన్టీఆర్ సుజల ద్వారా సురక్షిత మంచినీటిని సరఫరా చేయనున్నారు. 2014లో ఎన్టీఆర్ స్మారక ట్రస్ట్ ద్వారా ఎన్టీఆర్ సుజల పథకం పేరిట ప్రజలకు సురక్షిత తాగునీటి సరఫరాకు సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ శ్రీకారం చుట్టారు. కుప్పం డికెపల్లి చెరువు వద్ద మెయిన్ మదర్ ప్లాంట్ ఏర్పాటుచేయడంతో పాటు మిగతా పలుచోట్ల మదర్‌ప్లాంట్‌లు, గ్రామాల్లో ఎన్టీఆర్ సుజల ప్లాంట్లను ఏర్పాటుచేసి ప్రజలకు రూ 2.లకే 20లీటర్ల మంచినీటి సరఫరాను ప్రారంభిం చారు. ఈ పథకంకు ప్రజలనుంచి మంచి స్పందన వచ్చింది. అనంతరం ఈ పథకం కొనసాగింపు గ్రామీణ నీటిపా రుదల శాఖ అధికారుల చేతికి వెళ్ళింది. అయితే 2019లో వైకాపా అధికారంలో వచ్చాక ఎన్టీఆర్ సుజల పథకానికి పేరు, రంగులు మార్చారు. అయితే ప్రజలకు మాత్రం నాణ్యమైన తాగునీటిని అందించడంలో విఫలయ్యారు. నీటి ధర సైతం రూ 5లకు పెంచినా కేవలం కొన్ని చోట్ల మాత్రమే నీటిని సరఫరా చేయడంతో ప్రజలు పెదవి విరిచారు. ఎన్టీఆర్ సుజల ప్లాంట్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో నీటి పంపిణీ వ్యవస్థ చాలావరకు తగ్గిపోయింది. మరలా సిఎంగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టడంతో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఎన్టీఆర్ సుజల ప్లాంట్ల పునరుద్ధరణకు దాదాపు రూ 11కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం రూ 8.5 కోట్లను మంజూరు చేసింది. దీంతో త్వరలోనే ఎన్టీఆర్ సుజల ప్లాంట్ల పునరుద్ధరణ పనులు మొదలుకానున్నాయి. అతిత్వరలోనే ప్రజలకు మరలా నాలుగు మండలాల్లో ఎన్టీఆర్ సుజల నీరు అందుబాటులో రానుంది.

తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

# కష్టపడిన వారికే పదవులు!

అధినేత క్లారిటీ !

## పార్టీలో పదవులకోసం తెలుగుతమ్ముళ్ళ ఆరాటం



ప్రభాతవార్త-తిరుపతి:

పార్టీకోసం కష్టపడిపనిచేస్తున్న, జెండా మోస్తున్న కార్యకర్తలు, నాయకులకే పదవులు ప్రాధాన్యత ఉంటుందని స్వయంగా అధినేత, సిఎం చంద్రబాబునాయుడు స్పష్టతనివ్వడంతో తెలుగుతమ్ముళ్ళలో ఆశలు రేకెత్తుతున్నాయి. ఇదివరకు ఎన్నికల సమయంలో తమ అవకాశం కోసం పార్టీ మారి వచ్చిన నాయకులకు ప్రాధాన్యతనిస్తున్నారనే విషయంపై కార్యకర్తలు, తెలుగుతమ్ముళ్ళు గుర్రుమన్నారు. తీవ్ర అసహనం చెందారు. మహానాడు విజయవంతంతో అధినేత చంద్రబాబు, యువనేత లోకేశ్‌కు పరిస్థితి అవగతం కావడంతో సొంత పార్టీలో నేతలకు ప్రాధాన్యత నివ్వాలనేది నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే నామినేటెడ్ పదవులకోసం పలువురు తెలుగుతమ్ముళ్ళు తమ జాబితాను అధిష్టానంకు అందజేశారు. ఈ జాబితా చాంతాండంత ఉండటంతో పార్టీకోసం దశాబ్దాలుగా కష్టపడుతున్న నేతలు, కార్యకర్తల గుర్తింపుకు నామినేటెడ పదవులు కట్టబెడతారని ఆశావహులైన కూటమి పార్టీల నేతలు, ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నేతలు, కార్యకర్తలు వేచిచూస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి చంద్రబాబు భర్తీచేసిన పలు కీలకమైన నామినేటెడ్ పదవుల్లో సొంత జిల్లాలో తిరుపతి, చిత్తూరుజిల్లాలో కుప్పం, చంద్రగిరి, చిత్తూరునేతలకు పదవులు ఇచ్చారు. ఇంకా ఆలయాల పాలకమండళ్ళు, అభివృద్ధి సంఘాలకు కార్పొరేషన్‌లకు డైరెక్టర్ పదవులు భర్తీ కావలసి వుంది. సిఎం సొంత జిల్లాలో మూడునాలుగు దశాబ్దాలుగా పార్టీకోసం కష్టపడిన నేతలే ఉన్నారు. వీరంతా ఇప్పుడు డైరెక్టర్‌పదవులు చేజిక్కించుకోవడానికి విముఖతగానే ఉన్నారు. సొంత జిల్లాలో పార్టీని నమ్ముకున్న నేతలు చాలామంది వరకు ఉన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ వీరంతా ఇప్పటికీ టిడిపిని వీడటానికి ససేమిరా అంటున్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్నప్పటికీ తమకు ఆదరణ ఉంటుందనే విశ్వాసం కొందరు సీనియర్లు వెలిబుస్తున్నారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో పార్టీకోసం కష్టపడి ప్రజలకు చేరువై 13చోట్ల ఎమ్మెల్యేలను గెలిపించడంలో కార్యకర్తలు ,కొందరు నేతల పనితీరు ఎంతైనా ఉంది. తమకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని, ప్రజాసేవకు మరింతగా కష్టపడి పనిచేస్తామని యువత, పార్టీలో సీనియర్ నాయకులు తమ జాబితాను ఏకంగా అధినేతకే అందజేశారు. అందరికీ న్యాయం చేస్తానని, కష్టపడిన వారికి పదవులు ఇస్తానని భరోసా నిచ్చారనేది కార్యకర్తల నమ్మకం. తిరుపతి నుండి రాష్ట్ర కార్యదర్శులు సూరాసుధాకర్‌రెడ్డి, పుష్పావతియాదవ్, బుల్లెట్‌రమణ, ఇనుకొండ సుబ్రమణ్యం, ఎన్‌బి సుధాకర్‌రెడ్డి, మబ్బు దేవనారాయణరెడ్డి, దంపూరి భాస్కర్‌యాదవ్, బి.శ్రీధర్‌వర్మ, కంకణాల రజినీకాంత్‌నాయుడు, చిత్తూరు నుండి ఇద్దరు నేతలు, శ్రీకాళహస్తి నుండి ఇద్దరు నేతలు, నగరి నుండి ఇద్దరు నేతలు, సత్యవేడు నుంచి ఇద్దరు నేతలు, పూతలపట్టునుండి ఇద్దరు నేతలు, గూడూరు, జిడినెల్లూరు నియోజకవర్గం నుండి కొందరు నేతలు పదవులు వస్తాయని ఆశిస్తున్నారు. పదవులకోసం తెలుగుతమ్ముళ్లలో ఆరాటం మొదలైంది.

చిన్నశేష, హంస వాహనాలపై

# ప్రసన్న వెంకటేశ్వరుడు



ఆదివారం సాయంత్రం చిన్న శేష వాహనంపై శ్రీవారు



ఆదివారం రాత్రి హంస వాహనంపై స్వామివారు విహారం

వడమాలపేట, జూన్ 8 ప్రభాతవార్త:

అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారు ఆదివారం చిన్నశేష, హంస వాహనాలపై విహరించారు. అప్పలాయగుంటగ్రామంలో వృద్ధుడు మృతి చెందడంతో ఆదివారం గుడి తెరవలేదు. దహనక్రియలు పూర్తయిన తరువాత ఆలయాన్నిశుద్ధి చేసి, ఆలయాన్ని గ్రామాన్ని సంప్రోక్షణ చేసి సాయంత్రం 5 గంటలకు చిన్న శేష వాహనాన్ని అధిరోహించిన శ్రీవారిని మాడవీధుల్లో కాకుండా ఆలయం చుట్టూ ఊరేగించారు. సాయంత్రం జరగాల్సిన ఊంజల్‌సేవను రద్దు చేశారు. రాత్రి 7 గంటలకు వాహన మండపం చేరుకున్న శ్రీవారు అలంకరించిన హంస వాహనాన్ని అధిరోహించి పురవీధుల్లో విహరించారు. భక్తులు అడుగడుగునా స్వామివారికి కర్పూర హారతులు, నారికేళాలు సమర్పిస్తూ భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమాల్లోఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, రమణాచార్యులు, వేద పండితులు, టీటీడీ సిబ్బంది, పాల్గొన్నారు.

# ప్రత్యక్ష పద్ధతిలోనే టీచర్ల బదిలీలు

## డిఇఓ కార్యాలయంను ముట్టడించిన ఉపాధ్యాయులు

చిత్తూరు, జూన్ 8 ప్రభాతవార్త:

సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీలను ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్ ద్వారా కాకుండా ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయ ముట్టడి ఆదివారం ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో విజయవంతం అయ్యింది. ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి ఇప్పటి వరకు జరిగిన ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్‌లో జరుగగా, ఉపాధ్యాయుల కోరిక మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలతో సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహిస్తామని హామీ ఇచ్చింది. అయితే గత రెండు రోజులుగా మళ్ళీ ఎస్జీటీ బదిలీలను ఆన్‌లైన్‌లో నిర్వహించడానికి జిల్లా విద్యాశాఖ అధికారులు సిద్ధం అవుతుండటంతో ఉపాధ్యాయ సంఘాలు ముక్తకంఠంతో ఆదివారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చాయి. ఉపాధ్యాయ సంఘాల నేతలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు నిర్వహించడానికి కొత్త చట్టం అమలులోకి తీసుకువచ్చినప్పటికీ చట్టంలో వున్నట్లుగా కాకుండా మొత్తం బదిలీలు, పదోన్నతులను అస్తవ్యస్థంగా చేస్తున్నారని ఆరోపించారు. రెండు రోజుల క్రితం జరిగిన స్కూల్ అసిస్టెంట్ బదిలీల్లో ప్రిఫరెన్స్ కేటగిరి టీచర్లు పెద్ద మొత్తంలో నష్టపోయారన్నారు.



ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులచే డిఇఓ కార్యాలయ ముట్టడి

వెబ్ కౌన్సెలింగ్‌లో బదిలీలు నిర్వహించడం వల్ల ఇలాంటి పరిస్థితి దాపురించిందని వారు ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకైనా వెబ్ కౌన్సెలింగ్ రూపంలో కాకుండా ప్రత్యక్ష కౌన్సెలింగ్ నిర్వహించి వారు కోరుకున్న ప్రదేశానికి బదిలీ అయ్యే అవకాశం కల్పించాలన్నారు. రాష్ట్రం, జిల్లాలో వేలమంది ఉపాధ్యాయులు తప్పనిసరి బదిలీ కింద ఉన్నారని, ఇలాంటి ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో బదిలీలు కోరుకునే క్రమంలో వేలకొద్ది పోస్టులకు ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి వుంటుందని, ఇలా ఇచ్చుకున్నప్పటికీ ఆన్‌లైన్ సిస్టంలో సాంకేతిక సమస్యల వల్ల అనేక తప్పులు జరిగి టీచర్లు భారీగా నష్టపోతున్నారని ఉపాధ్యాసంఘ నాయకులు ఆరోపించారు. ఇలా నష్టపోయిన ఉపాధ్యాయులు ఫిర్యాదులు చేసినప్పటికీ వాటిని అధి కారులు పరిష్కరించకపోగా, కనీసం ఫిర్యాదులను సైతం తీసుకోవడం లేదన్నారు. ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ సజావుగా నిర్వహించాలంటే వెబ్ కౌన్సెలింగ్ కాకుండా ప్రత్యక్ష పద్ధతిలో కౌన్సెలింగ్ నిర్వహించి పూర్తి చేయాలని సంఘ నేతలు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాలనేతలు జివి రమణ, గిరిప్రసాద్, బాలాజీ, చెంగల్రాయ మందడి, ముత్యాలరెడ్డి, సోమశేఖర్ నాయుడు, ఎన్.మణిగండన్, బి.మోహన్, కిరణ్‌కుమార్, ముక్తిర్ అహ్మద్ కెఎస్‌కన్నన్, విజయ్ భాస్కర్‌రెడ్డి, నాగరాజు, జి.సాంబిరెడ్డి, వెంకటముని, జి.మునీర్ అహ్మద్, పి.సుధాకర్‌రెడ్డి, కె.దీనావతి, ఎస్పీ భాషా, దేవరాజులురెడ్డి, వందల సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తెప్పపై విహరించిన సుందరరాజ స్వామి





తిరుచానూరు, జూన్ 8, ప్రభాతవార్త :

తిరుచానూరు పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు దేదీప్యమైన దీప కాంతుల నడుమ భక్తులకు కన్నులు విందుగా సాగింది. తెప్పోత్సవాలు సందర్భంగా రెండవరోజు ఆదివారం పద్మసరోవరంలో సుందరరాజస్వామివారు తెప్పపై మూడు చుట్లు విహరించి భక్తులను అనుగ్రహించారు. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన, నిత్యార్చన, నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి వారికి వేడుకగా అభిషేకం నిర్వహించారు. ఇందులోభాగంగా పాలు, పెరుగు, తేనె, చందనం, సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పద్మపుష్కరిణి వద్దకు వేంచేపు చేశారు. అనంతరం తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. తరువాత సుందరరాజ స్వామి వారు ఆలయ నాలుగు మాడ్కవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి ఇతర అధికారులు, ఆలయ అర్చకులు, శ్రీవారి సేవకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# సూర్య చంద్రప్రభలపై చల్లనయ్య





తిరుపతి, జూన్ 8ప్రభాతవార్త:

తిరుపతిలో గోవిందరాజస్వామికి కన్నులపండువగా జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి గోవిందరాజస్వామి చంద్రప్రభ వాహనంపై చల్లనిదేవుడు కరుణించాడు. స్వామివారికి సూర్య చంద్రులు రెండునేత్రాలు. ఉదయం సూర్యప్రభలో ఊరేగిన గోవిందరాజులు రాత్రి నిశాకరుడైన చంద్రప్రభతో కూడిన వాహనంపై విహరించాడు. చంద్రుడు భగవంతుని మారు రూపమే. చల్లనిదేవరప్రభతో స్వామి భక్తులకు దర్శనమిచ్చాడు. సాయంత్రంనిత్యకైంకార్యలు పూర్తి చేసుకున్న తరువాత ఆలయంనుంచి వాహనమండపం వద్దకు వేంచేపుచేశారు. కర్పూరహారతులిచ్చి రాత్రి వాహనం ఆలయమాఢవీధుల్లో ప్రదక్షణగా బయలుదేరింది. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ విఆర్ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, ఏవిఎస్ఓ మోహన్‌రెడ్డి, అధికారులు, శ్రీవారిసేవకులు, అర్చకులు పాల్గొన్నారు. కాగా ఎనిమిదవరోజు ఆదివారం ఉదయం స్వామివారు సూర్యప్రభవాహనం అధిరోహించి మాఢవీధుల్లోసూర్య నారాయణుడు దివ్యకిరణకాంతుల్లో ప్రకాశిస్తూ భక్తుల అభయమిచ్చాడు. సప్తఅశ్వవాహనంతో రూపొందించిన సూర్యప్రభవాహనంపై వచ్చిన స్వామికి భక్తులు కర్పూరహారతతులిచ్చారు.

# కబ్జాల కోరల్లో పుంగనూరు

## యదేచ్ఛగా అక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ భూములు, చెరువులు, వంకలు







పుంగనూరు, జూన్ 8, ప్రభాతవార్త

పట్టణంలో ప్రభుత్వ భూములు, చెరువులు, వంకలు, చెరువు పోరంబోకు, వంకలు కాలువల పోరంబోకు స్థలాలు యదేచ్ఛగా అక్రమిణలకు గురవుతున్నాయి. జమీందారీ పరిపాలనలో పుంగనూరు ప్రాంతానికి నాలుగు వైపులా చెరువులు నిర్మించి ప్రజలకు సౌకర్యవంతంగా విశాలమైన వీధులు, చెరువు మిగులు నీరు పారుదలకు వంకలు నిర్మించారు. శతాబ్దాల తరబడి ఉన్న చెరువులు, వంకలు వాటి పోరంబోకు స్థలాలను గత పదేళ్లలో ఏకంగా భవనాలు పెద్ద పెద్ద నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు. వంకలను ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాలను కబ్జా చేసిన కొందరు ఆ వంకల మీదుగా ఏకంగా వంతెనలే నిర్మించుకుని దారులు ఏర్పాటు చేసుకున్నారు. రాయల్ చెరువు వంక కాలువ పోరంబోకులు పూర్తిగా దురాక్రమణకు గురయ్యాయి. కౌండిన్య నది వెంబడి కోనేటి పాలెం నుంచి హైస్కూల్ వీధి వెనుక భాగం ఎంఎస్‌ఆర్ థియేటర్ ప్రాంతం మీదుగా ప్రవహించే కోట్ల రూపాయలు విలువచేసే కౌండిన్య నది భూములు ఆక్రమణకు గురయ్యాయి. తాటిమాకులపాలెం సమీపంలో ఉన్న విశ్రాంతి ఎంప్లాయ్ భవనం ఎదుట కౌండిన్య నది కాలువ ప్రాంతాన్ని ఆక్రమించి, కార్ పార్కింగ్ ఏర్పాటుచేసారు. ఈ విధంగా రాయల్ చెరువు వంక కౌంటింగ్ అనేది వంకలను ఆక్రమించి వంతెనలు కట్టి భవనాలు కట్టడంతో వర్షాకాలంలో వంకలలో ప్రవహించాల్సిన నీరు రోడ్ల పైన ప్రవహించి పట్టణం జలదిగ్భంధానికి గురవుతోంది. వంకలు కాలువలు ఆక్రమించి భవనాలు కట్టిన వారంతా ప్రముఖ రాజకీయ నాయకుల కనుసన్నల్లో మెలిగే బడా వ్యక్తులు కావడం గమనార్హం. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఈ అన్యాక్రమణపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. గతంలో భారీ వర్షాల సమయంలో నది పొంగి పొర్లి, కాలువల ద్వారా నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయి. అయినా అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వారు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతుండటంతో రాబోయే వర్షాకాలంలో తిరిగి వరద ముప్పు తప్పదన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది. కబ్జాదారులు నిబంధనలను పక్కనపెట్టి పార్కింగ్ ద్వారా ఆదాయం సంపాదిస్తున్నప్పటికీ, సంబంధిత శాఖల అధికారులు చూస్తూ ఊరుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ, మున్సిపల్ శాఖలు చర్యలు తీసుకుని, ఆక్రమణదారులపై కఠినచర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం





కాణిపాకం, జూన్ 8 ప్రభాతవార్త:

## -కాణిపాకంలో కిక్కిరిసిన ఆస్థానమండపం

శుద్ద త్రయోదశి, స్వాతి నక్షత్రం నందు సామూహిక అక్షరాభ్యాసం సందర్భంగా సత్య ప్రమాణాల దేవుడు కాణిపాకం శ్రీవినాయకుని చెంత ఆదివారం భారీ ఎత్తున అక్షరాభ్యాసం కార్యక్రమాలు జరిగాయి. విఘ్ననాథుడైన వినాయకుని చెంత తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తే అంతా శుభమే కలుగుతుందని భక్తుల ప్రగాడ విశ్వాసం. పాఠశాలల్లో విద్యాభ్యాసం ప్రారం భించు చిన్నపిల్లలకు సకల విద్యలకు అధిపతి అయిన శ్రీవినాయక స్వామివారి అనుగ్రహం కలిగి విదా ్యభ్యాసంలో సమస్త విఘ్నాలు తొలగించు టకు దేవస్థానం వారిచే స్థానిక ఆస్థాన మండపంలో సామూహిక అక్షరా భ్యాసం కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తమ పిల్లలకు విఘ్ననాథుని చెంత ఓనమాలు దిద్ధించి అక్షరాభ్యాసం చేయించారు. ప్రతిరోజూ ఆలయంలో పదుల సంఖ్యలో మాత్రమే అక్షరాభ్యాసంలు జరుగుతుంటాయి. అయితే ఆదివారం శుద్ద త్రయోదశి, స్వాతి నక్షత్రం మంచి ముహూర్తం కావడంతో గణనాథుని చెంత అక్షరాభ్యాసం చేయించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆస్థానం మండపం పూర్తిగా నిండిపోయింది. ఇందులో భాగంగా ఉదయం ప్రధాన దేవాలయం నుండి సిద్ది, బుద్ది సమేత వినాయకస్వామివారిని, సరస్వతీ దేవి అమ్మవారి ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆస్థాన మండపంకు తీసుకువచ్చారు. అనంతరం వేదపండితుల మత్రోచ్ఛారణ నడుమ అర్చకులు సరస్వతీ యాగం చేసి అశేషంగా తరలివచ్చిన చిన్నా రులకు అక్షరాభ్యాసం చేయించారు. ఆలయ ఈఓ పెంచల కిషోర్ చేతుల మీదుగా పిల్లలకు పలక బలపంలను అందజేసి స్వయంగా చిన్నారుల చేత ఓనమాలు దిద్దించారు. అనంతరం పిల్లల తల్లిదండ్రులకు స్వామివారి ప్రసా దాలను అందజేశారు. అక్షరాభ్యాసంకు భారీ ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆస్థానమండపం పూర్తిగా నిండిపోయింది. ఈకార్యక్రమంలో ఆలయ ఈఈ వెంకట నారాయణ, ఏఈఓలు రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, సూపరెండెం ట్‌లు

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

– కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, జూన్ 8 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిశీలించి పరిష్కరించడానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో ఉదయం 10 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఈ కార్యక్రమంకు హాజరై ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటారన్నారు. అలాగే నియోజకవర్గ కేంద్రం, మండల కేంద్రాల్లో సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి సంబంధిత అధికారులు విధిగా హాజరై ప్రజా సమస్యలను ఆలకించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

## ఉల్లాసంగా .. ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమావేశం




కల్లూరు, జూన్ 8, ప్రభాతవార్త పులిచెర్ల మండలం మంగళంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993 – 94 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం ఉల్లాసంగా ఉత్సాహంగా జరిపారు. పాఠశాలలో అలనాటి తీపి గుర్తులు. గురువుల విద్యా బోధన ప్రస్తుత జీవన విధానంపై ఒకరికి ఒకరు పరిచయం చేసుకున్నారు. అలనాటి గురువులను ఘనంగా సన్మానించారు.

## షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికైన కల్లూరు జడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థులు



కల్లూరు, జూన్ 8, ప్రభాతవార్త పులిచర్ల మండలంలోని కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 10వ తరగతిలో మండల స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన నలుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎన్నికైయ్యారు. ఈ నాలుగు అవార్డు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కల్లూరు విద్యార్థులకే రావడం గమనార్హం. ఎన్నికైన విద్యార్థులు ఈ నెల 9వ తేదిన చిత్తూరులోని జిల్లా కలెక్టరు, ఇంచార్జి మంత్రి చేతుల మీదుగా రూ. 20 వేలు నగదు బహుమతితో పాటు మెడల్, ప్రశంసా పత్రం తీసుకోబోతున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంఈఓలు సిద్దరామయ్య, పోకల తాతయ్య, హెచ్ఎంశ్రీవాణి, పాఠశాలకమిటి చైర్ పర్సన్, ఉపాధ్యాయులు అభినందించారు.

## జర్నలిస్టు కృష్ణంరాజుపై పుంగనూరు పోలీస్ కేసు



పుంగనూరు రూరల్, జూన్ 8, ప్రభాతవార్త అమరావతి మహిళలపై సాక్షి మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేసిన జర్నలిస్ట్ కృష్ణం రాజు పై తగిన చర్యలు తీసుకోవాలని ఆదివారం పుంగనూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. తెలుగు మహిళలతో కలిసి పార్టీ మండల అధ్యక్షుడు మాధవ్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు కవిత, జనసేన వీర మహిళా అధ్యక్షురాలు జయమ్మ, మహిళా నాయకులు జ్యోతి, జనసేన జిల్లా ప్రోగ్రామ్స్ కమిటీ సభ్యులు చైతన్య రాయల్, పట్టణ అధ్యక్షుడు నరేష్ రాయల్, క్లస్టర్ ఇంచార్జ్ గంగాధర్, నాయకులు ప్రసాద్ స్వామి, రాంబాబు, మణి, గోపి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ చిక్కుల్లో సత్యవేడు...

బెంబేలెత్తిపోతున్న వాహనదారులు...



**సత్యవేడు, జూన్ 8 ప్రభాతవార్త:** నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడు పట్టణంలో ఉదయం, సాయంత్రం వేళలో ప్రధాన రోడ్ల మీదకు రావడమే సమస్యగా మారిపోయింది. ఏ వైపు చూసినా టిప్పర్ లారీలు...ఏ వాహనం ఎప్పుడు ఎవరి మీదకు దూసుకుపోతుందో తెలియని పరిస్థితి నెలకొందని పట్టణ వాసులు, వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మీరు ఎన్ని లారీలైనా తిప్పుకోండిఅంటూ ఏ వైపు చూసినా ఇటు గులక మన్ను లారీలు, ఆటో కంకర లారీల తాకిడి ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తోంది. ప్రధానంగా గాంధీ రోడ్డు, నేతాజీ రోడ్డు, శ్రీకాళహస్తి బస్టాండ్, మూడు రోడ్ల కూడలిలోని మహాత్మగాంధీ విగ్రహం చుట్టూ తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఈ కారణంగా ప్రధాన రోడ్లలోని వ్యాపారులు అవస్థలు పడుతుండగా, కొందరు రోడ్ల మీదే కార్లు, ఇతర వాహనాలను పార్కింగ్‌చేస్తున్నారు. అసలే ఇరుకు రోడ్లు...ఆపై రోడ్ల మీదే పార్కింగ్ ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణమవుతోంది. దీనికి తోడు భారీ టన్నులతో వివిధ వస్తువులను చెన్నైకి, చెన్నై నుంచి ఇతర ప్రాంతాలకు వచ్చే లారీల తాకిడి మరింత ప్రమాదకర పరిస్థితుల్లోకి తీసుకెళుతోందని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టిప్పర్ లారీలు, బారీ వాహనాలు, శ్రీసిటీకి కార్మికులను తరలించే వాహనాలు, ఆటోల తాకిడి మూలంగా అత్యవసరంగావెళ్లి వెంటనే ఇంటికి చేరుకోవడం సత్యవేడు ప్రాంతంలోని వాహనదారులకు అంత సులువైన పని కాదు. శ్రీకాళహస్తి బస్టాండ్‌లోని మలుపు వద్ద రోడ్లకు ఇరువైపులా లారీలను పార్కింగ్ చేస్తున్నారు. అక్కడ కూడా తరచూ ట్రాఫిక్ సమస్య, రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇక ఇదే పరిస్థితి ఆర్టీసీ బస్టాండ్ వద్దకూడా తరచూ ట్రాఫిక్ చిక్కుళ్లు ఏర్పడుతోంది.

***నన స్పీడ్ బ్రేకర్లు...దుస్థితి*** నిత్యం భక్తుల తాకిడితో ఉండే సత్యవేడు గంగ మిట్ట సమీపంలో ఉన్న స్పీడ్ బ్రేకర్లు పూర్తిగా దెబ్బతిని ఉన్నాయి. ఈ కారణంగా తమిళనాడుకు నిత్యం వేలాది వాహనాలు లక్షలాది టన్నుల్లో కంకరను ఈ మార్గం గుండా తరలిస్తున్నారు. స్పీడ్ బ్రేకర్లు సరిగా లేకపోవడంతో లారీలు మహిళా భక్తుల మీదకు పరుగులు పెడుతున్నాయి. ఈ కారణంగా కనీసం గంగమిట్ట వద్ద భయం లేకుండా అమ్మవారిని ప్రదక్షిణ చేయడం ఇబ్బందికరంగా మారిపోయిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరి చేయాల్సిన రోడ్ల భవనాల శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

***ఇక్కడ జీతాలు...అక్కడెక్కడో విధులు....!!*** రోడ్ల మీద ఆపిన వాహనాలను అలాగే చూస్తూ వదిలేయడం, కొందరు ద్విచక్రవాహనాలను ఎక్కడబడితే అక్కడ పడేస్తున్నారు. వాటి గురించి పట్టించుకోవడం లేదు. అప్పుడప్పుడు మేమున్నామని గాంధీ విగ్రహం వద్ద పోలీసులు ఇలా కనిపించి అలా వెళ్లిపోతున్నారు. రోడ్ల మీద ఆక్రమణలు, విచ్చల విడి పార్కింగ్, పంచాయతీ మురుగునీటి కాలువలు ఆక్రమించుకుని కొందరు ముందుకు వచ్చి దుకాణాలు నిర్వహిస్తూ వస్తున్నారు. భారీ వాహనాల కట్టడి, సహజ వనరులు తీసుకెళ్లే లారీలు ప్రజల మీదకు దూసుకుపోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకుంటే ట్రాఫిక్ సమస్యకు తాత్కాలిక పరిష్కారం చూడవచ్చునని స్థానికులు సూచిస్తున్నారు. ఇక పోలీసుశాఖ విషయానికి వస్తే సిబ్బంది లేదు ఉన్న వాళ్ళలో కొందరు డూయింగ్ డ్యూటీపై ఇతర ప్రాంతాలకు వెళ్లారని, ఉన్న వారితోనే అన్ని చూసుకోవడం కొంత ఇబ్బందిగా మారిందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

## నేడు యోగాంధ్ర అవగాహన ర్యాలీ

సదుం, జూన్ 8, ప్రభాతవార్త యోగాంధ్రకు సంబంధించి మండల స్థాయిలో సోమవారం యోగా అవగాహన ర్యాలీ నిర్వహించబడుతుంది అని ఎంపీడీవో హరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమమునకు విద్యార్థులు, గౌరవ ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, పత్రిక విలేకరులు, గ్రామ పెద్దలు, పోలీస్ సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు అందరూ హాజరై ర్యాలీని విజయవంతం చేయవలసిందిగా కోరారు సోమవారం ఉదయం 09:30 నిమిషాలకు సదం బస్ స్టాండ్ నుండి ర్యాలీ ప్రారంభమగుతుందని మండలంలో పనిచేయుచున్న ఫిజికల్ డైరెక్టర్లు ఈ కార్యక్రమంను ముందు వుండి నడిపించవలసిందిగ కోరారు.

## రైలు నుంచి జారిపడి వ్యక్తికి తీవ్రగాయాలు



కుప్పంరూరల్, జూన్ 8 ప్రభాతవార్త చెన్నై – బెంగళూరు రైలు మార్గంలో కుప్పం యార్డ్ స్టేషన్ వద్ద ప్రమాదవశాత్తు ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలునుంచి జారిపడి తీవ్రగాయాలపాలైనట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రమేష్ తెలిపారు. అతని తల, ముఖానికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించామన్నారు. గాయపడ్డ వ్యక్తికి 25-30 ఏళ్లు ఉంటాయన్నారు. సదరు వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే కుప్పం రైల్వే పోలీసులను, సెల్‌ఫోన్‌నెం 9494228854నెంబరును సంప్రదించాలని కోరారు.

## నేడు శాంతిపురంలో వేరుసెనగ విత్తనాల పంపిణీ

శాంతిపురం, జూన్ 8 ప్రభాతవార్త ప్రభుత్వం రైతులకు ఏటా రాయితీతో అందించే వేరుసెనగ విత్తనాలను సోమవారం శాంతిపురం మండలంలో పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయాధికారి అప్పోజి తెలిపారు. మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తదితరులు హాజరై అబకలదొడ్డిలో కార్యక్రమం ప్రారంభిస్తారన్నారు. అనంతరం అన్ని రైతు సేవా కేంద్రాల్లో పంపిణీ చేస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నేడు చిత్తూరులో పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల పర్యటన



కుప్పం, జూన్ 8 ప్రభాతవార్త ఎపిసిసి చీఫ్ వైఎస్ షర్మిల సోమవారం చిత్తూరు నగరంలో పర్యటించనున్నారు. నగరంలోని బైపాస్ రోడ్డులో ఉన్న బ్యాన్స్ హోటల్‌లో జరిగే జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశ ంలో ఆమె పాల్గొని ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం 3గంటల దాకా ఈ కార్యక్రమం కొనసాగుతుంది. అనంతరం అనంతపురం జిల్లాకు ఆమె పయనమవుతారు.

## ఆవుల రామచంద్రయ్యకు భార్యా వియోగం



చౌడేపల్లి, జూన్ 8 ప్రభాతవార్త తేదేపా సీనియర్ నాయకుడు, ఆపార్టీ మండల ఉపాధ్యక్షుడు ఆవుల రామచంద్రయ్య సతీమణి ఆవుల మునిరత్న మ్మ(55)అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో పలువురు రాజకీయ ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు సంతాపాన్ని తెలిపారు. రాష్ట్ర మాజీ మంత్రి, పలమనేరు ఎమ్మెల్యే నూతనకాల్వ అమరనాథరెడ్డి, పుంగనూరు తేదేపా ఇన్‌ఛార్జీ చల్లా రామచంద్రారెడ్డి, మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి, తదితరులు మునిరత్నమ్మ భౌతిక కాయానికి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబాన్ని పరామర్శించారు.

## యోగాంధ్ర విజయవంతం దిశగా ఏర్పాట్లు

చౌడేపల్లి, జూన్ 8 ప్రభాతవార్త



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా శక్తిక్షేత్రం బోయకొండ గంగాపురంలో ఈనెల 9న చేపట్టిన యోగాంధ్ర విజయవంతానికి ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తేదేపా మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి)తెలిపారు. ఈమేరకు పలమనేరు ఆర్డీఓ భవానీ, తహశీల్దార్ హనుమంతు, ఎంపిడిఓ లీలామాధవి, ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరంలు బోయకొండ గంగాపు రానికి సమీపంలో దాదాపు 2వేల మందితో యోగాసనాలు వేసే విధంగా ఏర్పాట్లు చేసారు. ఎస్ఐ నాగేశ్వరరావు, తేదేపా సీనియర్ నాయకుడు శ్రీధర్‌రాజు(గిరి), బోయకొండ సుబ్బు, అర్జున్, సోము, రెడ్డి, మండలస్థాయి అధికారులు, తేదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి రాక

చిత్తూరు, జూన్ 8 ప్రభాతవార్త: జిల్లా ఇన్‌చార్జీ మంత్రి, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోమవారం జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి సోమవారం ఉదయం 5 గంటలకు రాయచోటి నుండి బయలుదేరి ఉదయం 6.30 గంటలకు బోయకొండ చేరుకుని యోగాంధ్రా పాల్గొంటారన్నారు. అనంతరం ఇన్‌ఛార్జీ మంత్రి 9.30 గంటలకు చిత్తూరు చేరుకుని ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో కొద్ది సేపు విశ్రాంతి తీసుకుని ఉదయం 10 గంటలకు చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో జరిగే షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదాన కార్యక్రమంలో పాల్గొంటాచని కలెక్టర్ తెలిపారు.

## నేడు షైనింగ్ స్టార్ట్ అవార్డుల ప్రదానం

చిత్తూరు, జూన్ 8 ప్రభాతవార్త: విద్యార్థుల్లోని ప్రతిభ ప్రతనాలు పెంపొందించడానికి ప్రభుత్వం షైనింగ్ స్టార్ట్ అవార్డులను ప్రదానం చేస్తోందని, ఈ అవార్డుల ప్రదాన కార్యక్రమం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో ఉదయం 10 గంటలకు జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో 31 మండలాల నుండి టెన్త్ పరీక్షల్లో అత్యధిక మార్కులు పొందిన 190 మంది విద్యార్థులకు అలాగే ఇంటర్మీడియేట్‌లో 33 మంది విద్యార్థులకు ఈ అవార్డులు అందజేయడం జరుగుతుందన్నారు. అవార్డు పొందిన ఒకొక్క విద్యార్థికి ప్రసంశాపత్రంతో పాటు రూ.20 వేల నగదు ప్రదానంతో పాటు మెడల్ అందించడం జరుగుతుందన్నారు. ఈ అవార్డుకు ఎంపికైన విద్యార్థులు ఆధార్‌కార్డు, విద్యార్థి గుర్తింపు కార్డు, స్టడీ సర్టిఫికేట్, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు తీసుకురావాలన్నారు. అలాగే ప్రతి విద్యార్థితో పాటు తల్లిదండ్రుల్లో ఒకరు ఆధార్ కార్డుతో అనుమతించబడుతారని తెలిపారు.

## ఈతకు వెళ్ళి యువకుడు మృతి



బంగారుపాళ్యం, జూన్ 8 ప్రభాతవార్త: మండల కేంద్రం బంగారుపాళ్యం తహసిల్దారు కార్యాలయం సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో ఈతకు వెళ్ళి ఆదివారం మధ్యాహ్నం ఓ యువకుడు మృతి చెందాడు. కర్నాటక రాష్ట్రం ముళ్‌బాగల్ తాలుకా చాపరపల్లికి చెందిన ఎం.మురళీ(23) ఈత కొడుతూ మృత్యువాత పడ్డాడు. చాపరపల్లికి చెందిన అమర, అజయ్, విశ్వనాధ్, విజయ్, రాజశేఖర్, గణేష్, తేజలు వ్యవసాయ మార్కెట్ యార్డులో లోడింగ్ కూలీ పనుల కోసం బంగారుపాళ్యం విచ్చేశారు. ఆదివారం మధ్యాహ్నం సరదాగా ఈత కోసం వీరందరు కలిసి వ్యవసాయ బావి వద్దకు వెళ్ళి ఈత కొట్టారు. ఆ సమయంలో మురళీ ఈత కొడ్తూ బావిలో లోతు ప్రాంతంలోకి వెళ్ళి ఊపిరి ఆడక మృతి చెందాడు. ఈ విషయంను గుర్తించిన స్నేహితులు సమాచారంను సమీప రైతులకు తెలిపారు. అతికష్టం మీద నీటిలో మునిగిన మురళీ మృతదేహంను బయటికి తీసి శవపరీక్ష నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు.

## జగన్‌రెడ్డీ ఆడబిడ్డల్ని అవమానిస్తారా



– తెలుగుమహిళల ఫైర్

కుప్పం, జూన్ 8 ప్రభాతవార్త రాజధాని అమరావతి నగర మహిళల్ని మాజీ సిఎం జగన్‌కు చెందిన ఓ ఛానల్‌లో అవమానించడం దారుణమని కుప్పం నియోజకవర్గ తెలుగు మహిళలు ఫైర్ అయ్యారు. ఆదివారం నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు అనసూయ నేతృత్వంలో స్థానిక పార్టీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆంధ్రుల కలల రాజధాని అమరావతిని వేశ్యల రాజధాని అని ఆ ఛానల్‌లో చర్చాగోష్టి పెట్టిన కొమ్మినేని శ్రీనివాస్, కృష్ణంరాజులపై వెంటనే ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా, ఎస్సీ కమీషన్, పిసిఐ తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జగన్‌రెడ్డి మహిళా లోకానికి బేషరతుగా క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. సొంత తల్లిని, చెల్లిని జగన్ పట్టించుకోకపోగా ఆయన ఛానల్‌లో మహిళల్ని అవమానపరచడం తగదని పేర్కొన్నారు. రాజధాని నగరం కోసం భూములు ఇచ్చి మహిళా రైతులు రాజధాని నిర్మాణం కోసం వైఎస్సార్సీ హయాంలో ఉద్యమించారన్నారు. అలాంటి అమరావతి నగరాన్ని వేశ్యల రాజధాని అని మాట్లాడడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళల గురించి నీచంగా మాట్లాడిన కొమ్మినేని, కృష్ణంరాజుల ఇళ్లల్లో ఆడవాళ్లు లేరా అని ప్రశ్నించారు. జగన్‌ను ప్రజలు 11 సీట్లకు పరిమిత ం చేసినా ఆయన రాజధానిపై తన విద్వేషాని ్న కక్కుతున్నారన్నారు. వెంటనే బేషరతు క్షమాపణలు చెప్పకుంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షురాలు అనసూయ, కడ సభ్యురాలు సుగుణమ్మ, జిల్లా నాయకురాలు చంద్రకళ, మండల మహిళా విభాగం అధ్యక్షులు శారదమ్మ, పద్మమ్మ, మహిళానేతలు స్వాతి, తిరుమగళ్, పుష్ప, జనసేన నవనీత తదితరులు పాల్గొన్నారు.

## బలిజలను బిసిలుగా గుర్తించాలని పాదయాత్ర



చిత్తూరురూరల్, జూన్ 8 ప్రభాతవార్త: అన్ని రంగాలలలో వెనుకబడిన బలిజలను బిసిలుగా గుర్తించేంతవరకు పోరాటం కొనసాగిస్తానని ఆంధ్రప్రదేశ్ బలిజ, కాపు, తెలగ, ఒంటరి కులాల బిసి రిజర్వేషన్ సాధన సమితి అధ్యక్షుడు ప్రసాద్ తెలిపారు. ఆదివారం చిత్తూరు పట్టణం, నాగయ్య కళాక్షేత్రం వద్ద నున్న శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం వద్ద నుంచి ఆయన రాజధాని అమరావతి వరకు పాదయాత్ర ప్రారంభించారు. తరతరాలుగా బలిజలకు రాజకీయాల్లో తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘ అధ్యక్షుడు రామదాసు, రాయల్ ప్రొటెక్షన్ ఫోర్స్ నేత రెడ్డి శేఖర్, బలిజ సంఘ నాయకులు ఆరణి తులసీరామ్, కడియాలవరదరాజులు, రామ్మూర్తి, విశ్వనాథ్, నరసింహులు, బాలాజీ పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే చిత్తూరు అభివృద్ధి



చిత్తూరురూరల్, జూన్ 8 ప్రభాతవార్త: గత ప్రభుత్వ వైఖరితో చిత్తూరు అన్ని రంగాల్లో వెనుకబడిందనీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో సాధ్యమైనంతవరకు అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నట్లు తెదేపా అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరిశ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం జరిగిన చిత్తూరు స్మార్ట్ సిటి డెవలప్‌మెంట్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావులు చిత్తూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారనీ, నగర శివారులో అనేక రహదారులు కలుస్తున్నాయనీ, కాట్పాడి-తిరుపతి రైల్వే డబుల్‌లైన్ పనులు ప్రారంభమయ్యాయనీ, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ కలయికతో ఇంకా ఎంతో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు తాండవమూర్తి, గోపి నాయక్‌లు మాట్లాడుతూ చిత్తూరు నగర అభివృద్ధి జరిగేంతవరకు సొసైటీ తరపున నిరంతం పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మురళీ, సత్య, కార్పొరేటర్ అశోక్, నాయకులు రషీద్, శ్రీనివాసబాబు, అశోక్‌కుమార్, మల్లికార్జునరావు, రాజేంద్ర, శరత్, రమేష్‌బాబు, కుమరేషన్, శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## శస్త్ర చికిత్సలకు 63 మంది ఎంపిక



సదుం, జూన్ 8, ప్రభాతవార్త స్థానిక శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 63 మంది ఆపరేషన్లకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. పీలేరు మానవతా సంస్థ తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించగా ఈ శిబిరంలో 150 మంది పరీక్షలకు హాజరుకాగా వారిలో 63 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. వీరికి తిరుపతి అరవింద్ వెంకటేశ్వర కంటి వైద్యశాలలో శస్త్ర చికిత్సలు నిర్వహించి తిరిగి క్యాంపు దగ్గరకి చేర్చబడునని. వీరికి ఉచితంగా ఆపరేషన్, మందులు అద్దములు ఉచితంగా పంపిణీ చేస్తారని పీలేరు మానవతా చైర్మన్ వి రామచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమానికి తిరుపతి కంటి వైద్య నిపుణులు డాక్టర్ స్ఫూర్తి, డాక్టర్ సింధు , అరవింద్ వెంకటేశ్వర కంటి వైద్యశాల నిర్వాహకులు వై గౌరీ శంకర్ కుమార్, పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సదుం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వై జయకుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు కె అమర్నాథరెడ్డి, పీలేరు మానవత కన్వీనర్ వై. వెంకటరమణ ,కార్యదర్శి సురేష్, మాజి కార్యదర్శి ప్యారుఖాన్, సభ్యులు పెంజ్యూరి అశోక్, రిటైర్డ్ ఉపాధ్యాయులు గఫార్ సాహెబ్ వాలంటీర్ శ్రీకాంత్ రెడ్డి, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

## ఎపి ఈఏపీసెట్ 2025 ఫలితాలలో శ్రీచైతన్య విజయభేరి

తిరుపతి విద్య, జూన్ 8 ప్రభాతవార్త



ప్రభుత్వం ప్రకటించిన ఎ పి ఈఏపిసెట్ ఫలితాలలో శ్రీచైతన్య విద్యార్థులు ఇంజనీరింగ్, అగ్రికల్చర్, రెండు విభాగాలలో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి విజయకేత నం ఎగురవేశారు. ఓ అరుష్ లక్ష్మణ్ 45, వి యశ్వంత్ 135, డి లావణ్య 230, లక్ష్మి సహస్ర 322, ఏ జశ్విత 398, కే జశ్విత 444, వైశివకృతిక492, హర్షవర్ధన్ 528 ఎం ఉమేష్ 551, ఎం హిమవర్ష 787, సి రామ లక్ష్మమ్మ 799, వి లక్ష్మి హర్షిత 800, కె మంజునాథ మహర్షి 900, కె టీనారాణి 919, వి సాధన 925 వంటి 1000 ర్యాంకులు సాధించడంతో పాటుగా 167 మంది విద్యార్థులు 5000 లోపు ర్యాం కులు, 348 మంది విద్యార్దులు 10 వేల లోపు ర్యాంకులు సాధించి అగ్ర పదాన నిలిచారు. ఇంతటి అద్భు త విజయాలకు కారణం, అధ్యాపకుల సమిష్టి కృషితో పాటుగా ఉత్తమ ఆబ్జెక్టివ్ మెటీరియల్స్, విద్యార్దుల అకుంతత దీక్షలే కారణం అని డైరెక్టర్స్ సుష్మశ్రీ, నాగేంద్రలు తెలియజేశారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ర్యాంకులు సాదించిన విద్యార్థులను, అద్యాపకులను శ్రీచైతన్య తిరుపతి శాఖ ఎ.జి.యం.బి.వి. ప్రసాద్, అలాగే డీన్లు కె.యల్.జి. ప్రసాద్, రామ్మోహన్ రావు, శ్రీనివాసరాజు, భాస్కర్లతో పాటు ప్రిన్సిపాల్స్ అభినందించారు.

## గంగజాతరలో వసతులపై దృష్టి పెట్టండి

సత్యవేడు, జూన్ 8 ప్రభాతవార్త: సత్యవేడు మేజర్ పంచాయతీలో బుధ, గురువారాల్లో గంగమ్మజాతర వేడుకలు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. రాయలసీమ ప్రాంతానికి తలమానికంగా సర్వమత సమ్మేళనంకు ప్రతీకగా సాగే ఈ జాతరకు స్వరాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి ఎక్కువ సంఖ్యలో భక్తులు వస్తుంటారు. వచ్చే భక్తులకు వసతులపై నిర్వాహకులు, ఇతర ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కనీస సౌకర్యాలు కూడా కొన్ని చోట్ల లేకపోవడంతో భక్తులు నానా తంటాలు పడాల్సిన పరిస్థితి వస్తోంది. అటువంటి వాటికి అవకాశాలు లేకుండా వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గంగమ్మ ఊరేగింపు అనంతరం శక్తిపీఠమైన గంగ మిట్ట వద్ద కొలువులో ఉంచుతారు. ఆ సమయంలో భక్తులు క్యూ లైన్‌లో అమ్మవారిని దర్శించుకుకోవడం జరుగుతుంది. సరైన క్యూలైన్లు ఏర్పాటు చేయకపోవడం, చలువ పందిల్లు కంటి తుడుపుగా ఏర్పాటు చేస్తారు. ఈ కారణంగా భక్తులకు ఎండ తాకిడికి ఎక్కువ ఇబ్బందులు పడుతుంటారు. వేపాకు చీరలు ధరించి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్న అనంతరం ఆ వేప చీరలను ఆలయం వద్ద పడేస్తుంటారు. దాంతో రాకపోకలకు ఇబ్బందులు ఎక్కువవుతున్నాయి. వాటిపై కూడా జాతర నిర్వాహకులు, పంచాయతీ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. తాత్కాలిక షెడ్ల ఏర్పాటుపై కూడా చర్యలు తీసుకోవాలి. బుధవారం నుంచి ఆదివారం సాయంత్రం వరకు నేతాజీ రోడ్డు, గాంధీ రోడ్డు, బస్టాండ్ పరిసరాల్లో ఎక్కువ మంది వ్యాపారస్తులు రోడ్ల పక్కన తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేస్తారు. వాటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పై రోడ్లలో వాహనాలు రాకుండా కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిరంతరాయ విద్యుత్, పంచాయతీ మంచినీటి సరఫరా, పారిశుధ్యం, ఆయా సిబ్బంది పనితీరుపై సంబంధిత శాఖ అధికారులు అప్రమత్తంగాచర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా మంచినీరు అందించే విధంగా ముందస్తు చర్యలు తీసుకోవడం చాలా మంచిదని భక్తులు సూచిస్తున్నారు.

## వైఎస్ భారతిని అరెస్టు చేయాలి

### గోళ్ళ హేమాద్రినాయుడు డిమాండ్

చిత్తూరురూరల్, జూన్ 8 ప్రభాతవార్త: అమరావతి మహిళలను కించపరచిన సాక్షి ఛానెల్ ఎండి వైఎస్ భారతిని అరెస్టు చేయాలని రాష్ట్ర తెలుగుయువత అధికార ప్రతినిధి గోళ్ళ హేమాద్రినాయుడు డిమాండ్ చేశారు. సిఎం నారా చంద్రబాబును నమ్మి అక్కడి ప్రజలు 35 వేల ఎకరాలు భూమిని రాజధానికి ఇచ్చిన గొప్ప త్యాగమూర్తులు అమరావతి వాసులని, అలాంటి వారిని సాక్షి ఛానెల్‌లో వేశ్యలు అని అందరిని కలిపి మాట్లాడటం అవివేకమన్నారు. రాజధాని అమరావతి అభివృద్ధి చెందుతుంటే మొదటి నుండి వైకాపా నాయకులు ఓర్చుకోలేక విషం చిమ్ముతున్నారని ఆరోపించారు. రాజధాని అభివృద్ధిని అడ్డుకుని శాంతి భద్రతల సమస్యను సృష్టించి రాజధాని పనులు నిలిపివేయాలని వైకాపా ప్రణాళిక అని ఆయన మండి పడ్డారు.

## వైభవంగా నంది ప్రదేశం

పుత్తూరు రూరల్, జూన్ 8 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం నంది ప్రదోషం కార్యక్రమాన్నిఘనంగా నిర్వహించారు. ఉదయం కామాక్షి దేవి శ్రీ సదాశివేశ్వర స్వామికి, అలాగే ఆలయ ఆవరణలో ఉన్న పరివార దేవతలను అభిషేకాలు, అలంకరణలు చేశారు. సాయంత్రం నంది వాహనంపై కామాక్షిదేవిని శ్రీ సదాశివేశ్వర స్వామిని ఆలయ ప్రదక్షిణం చేపట్టారు.

## పాతావీరాపురంలో వైద్య శిబిరం



శ్రీకాళహస్తి రూరల్, జూన్ 8 ప్రభాతవార్త

ఏర్పేడు మండలం పాతవీరాపురం జరుగుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాలు, 51 వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమన్యం సారధ్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఏర్పేడు మండలంలోని పలు గ్రామాల్లో సామాజిక కార్యక్రమాలను నిర్వహించటంలో డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం చొరవ చూపుతున్నారు. అంతేకాక గ్రామాల్లో కుటుంబ పెద్ద మరణిస్తే ఆ కుటుంబాన్ని ఆదుకొనుటకు 'సిపాయి భరోసా' అందిస్తూన్నారు. ఈ నేపధ్యంలో చుట్టు పక్కల గ్రామాల నుంచి ఉత్సవాలకు వచ్చే వారి కోసం అంతేకాక చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు వైద్య సేవలందించుటకుముందుకువచ్చారు. పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణి చేసారు.

## తెలుగు ప్రొఫేషనల్ వింగ్ ఏడాది సంబరాలు

శ్రీకాళహస్తి రూరల్, జూన్ 8 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలంలో ఆదివారం తెలుగు ప్రొఫేషనల్ వింగ్ ఉద్యోగులు తెలుగుదేశం పార్టీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని వేడాంకు సమీపంలోని ఓ అతిధిగృహంలో జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు సంబంధించి పార్లమెంట్ కమిటి అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గ, మండల కార్యదర్శుల సారథ్యంలో సంబరాలు జరుపుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాధారపు చాణుక్య, అధ్యక్షులు రావూరు సుమంత్, నియోజకవర్గ అధ్యక్షులు ఉమేంద్రారెడ్డిల సారథ్యంలో సంబరాలు జరుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహాకులు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని అందుకు మనం ముందడుగు వేయాలని పిలుపు నిచ్చారు. ఎలాగైతే ఎన్నికల్లో నారాచంద్రబాబునాయుడు నాయకత్వం అవసరమని ప్రజలకు చెప్పి ఓట్లు వేయించుకున్నామో అలాగే నేడు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నా సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ ఓ వైపు అమరావతి రాజధాని నిర్మాణం మరో వైపు పోలవరం ప్రాజెక్టు పూర్తితో పాటు సంక్షేమ పథకాలు పెన్షన్లు, రేషన్ ఎక్కడైనా తీసుకోవచ్చునని నిరుద్యోగుల ఆశలకు అనుగుణంగా డిఎస్‌సి నిర్వహణ చేపడుతుంటే వైకాపా సొల్లు కబుర్లతో ప్రజల్ని తప్పుదారి పట్టిస్తున్నారని చర్చించారు. రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రాగా మార్చిన నాయకులు నేడు తగుదనమ్మా అంటూ రోడ్లమీదకు వచ్చి ప్రభుత్వంపై బురద చల్లటానికి ప్రయత్నిస్తున్నారని దీనిని మనందరం కలసి కట్టుగా ఖండిస్తూ ప్రభుత్వం చేపడుతున్న పథకాలను లబ్దిని ప్రజలకు తెలియజేయుటకు ముందుకు రావాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా సహపంక్తి భోజనాలు సంబరాలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి పంచుకున్నారు

## పాతవీరాపురంలో అగ్నిగుండం

శ్రీకాళహస్తిరూరల్, జూన్ 8 ప్రభాతవార్త



ఏర్పేడు మండంలోని పాతవీరాపురంలో ఆదివారం ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న 51వ వార్షికోత్సవంలో భాగంగా అగ్నిగుండం కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఏర్పేడు మండలంలోని ఏర్పేడు చుట్టుపక్కల గ్రామాలకు సంబంధించిన ప్రజలు ఇక్కడ చేరి ఉత్సవాలను నిర్వహించుకోవటం ఆనవాయితి. వారం రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో ప్రధాన ఉత్సవం అగ్నిగుండం. ఉదయం నుంచి ఆలయంలోని ఆవరణలో మహిళలు భారీ ఎత్తున పాల్గొని పొంగళ్ళు పెట్టారు. ఇందుకు ఆలయ కమిటి చక్కటి ఏర్పాట్లు చేసారు. కంకణాలు ధరించిన భక్తులు చేతిలో వేప మండ పట్టుకొని గోవిందా అంటూ నినాదాలతో తిరిగారు. గ్రామమంతా మాల ధరించిన భక్తులతో పచ్చగా మారింది. సాయంత్రం ద్రౌపదీ అమ్మవారిని చక్కగా అలంకరించి అగ్నిగుండం వద్దకు తెచ్చి ప్రతిష్టించారు. అమ్మవారి వడిలో నిప్పు కణికలను కట్టి పూజారి రవి ముందుగా అగ్నిగుండంలో పూల మాల వేస్తూ దిగారు. తరువాత భక్తులు అగ్నిగుండంలో ప్రవేశించారు. ఈ ఉత్సవాలు కన్నుల పండువగా సాగాయి. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ మంజుల, మాజీ జడ్‌పిటిసి మునిరంగారెడ్డి, మునిరత్నం రెడ్డి, ఆలయ కమిటి చైర్మెన్ కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు మునికృష్ణారెడ్డి, కొంగర దాము, హరిదాసురెడ్డి, బాలాజి, మనోహర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

## ఏ పి ఈఏపీసెట్ ఫలితాలలో శ్రీధర్ అకాడమీ ప్రభంజనం

తిరుపతి విద్య, జూన్ 8 ప్రభాతవార్త



తిరుపతి ఎ.ఐ.ఆర్. బైపాస్ రోడ్ లోని శ్రీధర్స్ అకాడమీ విద్యార్థులు ఈఏపీసెట్ 2025 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు చైర్మన్ మద్దినేని శ్రీధర్ తెలియచేశారు. ఇంజనీరింగ్ మరియు అగ్రికల్చర్ లో వి. మోహిష్ 228 ర్యాంకును, కే. సాయి పార్థివ్ 737 ర్యాంకు ను, పి. నిఖిలేశ్వర్ 1365 ర్యాంకును, ఎస్. పెన్నిధి 3919 ర్యాంకు ను, వి. అమృత 4414 ర్యాంక్ ను, అలాగే ఎ పి ఈఏపీసెట్ పరీక్షకు హాజరైన 110 మంది విద్యార్థులుకు గాను 10 వేల ర్యాంకు లోపు 25 మంది సాధించారు అని తెలిపారు. ఈ ఫలితాలు సాధించిన విద్యార్థులకు చైర్మన్ మద్దినేని శ్రీధర్ అభినందనలు తెలియచేశారు.

## ఎపిఈఏపీసెట్ ఫలితాలల్లో బి.వి.కె జూనియల్ కాలేజి సంచలనం.

తిరుపతి విద్య జూన్ 8 ప్రభాత వార్త




రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన ఎ పి ఈఏపీసెట్ (ఇంజనీరింగ్) 2025 ఫలితాలలో తిరుపతిలోని అమరావతి ఐఐటి అకాడమీలో యంపిసి. విభాగం రాష్ట్ర స్దాయిలో బి.అరుణ్ కుమార్ రెడ్డి 125వ ర్యాంకు, వి. కెయూష్ సాయి 731వ ర్యాంక్, పి. రూత్విక్ 751 ర్యాంక్, కె. సంతోష్ 799 ర్యాంక్, టి. వంశీకృష్ణ 960వ ర్యాంకులు సాధించారు. రాష్ట్రస్థాయిలో 1000 లోపు 5 ర్యాంకులు, 2000 లోపు 40 ర్యాంకులు, 3000 లోపు 70 ర్యాంకులు సాధించారని చైర్మెన్ తెలిపినారు. ఇంత ఉన్నత స్థానం సాధించడం ఎంతో ముదావహం అని, ఈ విజయాలు సాధించడానికి దోహదపడిన అధ్యాపకులకు, అధ్యాపకేతర సిబ్బందికి మరియు విద్యార్థుల తల్లిదండ్రులకు కళాశాల చైర్మెన్ బి.వి.కృష్ణారెడ్డి, వైస్ ఛైర్మెన్ పార్థీవ్ రెడ్డి విలేకరుల సమావేశంలో కృతజ్ఞతలు తెలియజేసినారు.

## నేడు మామిడి మద్దతు ధర కొరకై

నిరసన కార్యక్రమం విజయవంతం చేయాలి

కేవీబీ పురం, జూన్ 8 ప్రభాతవార్త:

మామిడి పంటకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అమలు కొరకు కేవీబీ పురం మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో మామిడి రైతులు పాల్గొని జయప్రదం చేయాలని రైతు సైంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి జనార్దన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి ధర 12 రూపాయల వంతున కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించినప్పటికి ఆచరణలో అమలు జరగడం లేదని విమర్శించారు. రైతుల నుంచి అయినకాడికి మామిడి గుజ్జు పరిశ్రమ యజమానులు కేవలం కిలో 5 రూపాయలకే కొనుగోలుచేస్తూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయకపోవడం దారుణమన్నారు. మామిడి గుజ్జు పరిశ్రమ యజమానులు సిండికేట్‌గా మారి కనీసం నాలుగు, ఐదు రూపాయలకు కిలో తోతాపురి కొనుగోలు చేస్తూ రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అమలు కోసం మండలంలోని రైతులందరూ పార్టీలకతీతంగా సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే కార్యక్రమంలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## నేడు ప్రతిభా అవార్డులు ప్రదానం

తిరుపతి విద్య, జూన్ 8 ప్రభాతవార్త

జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో నేడు ప్రతిభా పురస్కార అవార్డులను ప్రధానం చేయనున్నట్లు ఆర్‌ఐఓ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ హాజరై ఎంపిక చేసిన విద్యార్థికి ఇరవై వేల రూపాయల చెక్కును అందజేస్తారన్నారు. జిల్లాలో వివిధ జూనియర్ కళాశాల నుంచి ప్రతిభా పురస్కానికి ఎంపికైన 40 మంది విద్యార్థులు తమ తల్లిదండ్రులతో పాటు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారికి మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశామన్నారు. ప్రతి జూనియర్ కళాశాల యాజమాన్యం తమ కళాశాల నుంచి ఎంపికైన విద్యార్థులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

## అంకాళపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న మాజీ మంత్రి రోజా



పుత్తూరు రూరల్, జూన్ 8 ప్రభాతవార్త:

పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు కామరాజునగర్‌లో వెలసిన అంకాళపరమేశ్వరి అమ్మవారి తిరుణాళ్ళ సందర్భంగా మాజీ మంత్రి రోజా అమ్మవారి ఆలయంలో విశేష పూజలు చేశారు. అమ్మవారికి డప్పు వాయిద్యాల నడుమ పూరవీధుల్లో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు ఆమెకు తీర్థ ప్రసాదాలు అందించారు. వైసీపీ నాయకులు గ్రామస్తులు మాజీ మంత్రికి ఘన స్వాగతం పలికి సన్మానించారు.

## 23న ఒలంపిక్స్ డేను జయప్రదం చేయండి




-ఎలమంచిలి ప్రవీణ్

తిరుపతి విద్య, జూన్ 8 ప్రభాతవార్త

జూన్ 23న జరిగే ఒలంపిక్స్ డేను జయప్రదం చేయాలని తిరుపతి జిల్లా ఒలిపిక్స్ అసోసియేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎలమంచి ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం తిరుపతి స్థానిక ప్రైవేట్ హోటల్ నిర్వహించిన తిరుపతి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా 40 సంవత్సరాల నుండి క్రీడలకు సేవలందించిన ప్రసన్నకుమార్‌ని దుస్సాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎలమంచిలి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 23న ఒలంపిక్ డే నీ ఘనంగా జరుపుకుంటారని తెలిపారు. కేవలం ఆటలు మాత్రమే కాకుండా, ఐక్యత, శ్రమ, సమనత్వం వంటి మానవ విలువలను ప్రపంచానికి చాటే ప్రత్యేక రోజు అని అన్నారు. తిరుపతిలో ప్రతిభావంతులైన యువ క్రీడాకారుల భవిష్యత్తుకు బలమైన మద్దతుగా, త్వరలో ప్రారంభించబోయే స్పోర్ట్స్ స్కూల్ పకటన మరింత ఉత్సాహాన్ని జోడిస్తుందని అన్నారు. ఒలంపిక్ డే సందర్భంగా నిర్వహించే ఒలంపిక్ రన్ ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి సాయి కుమార్, ఉపాధ్యక్షులు శివ ప్రసాద్, సహ కార్యదర్శి విజయ్ కుమార్, రత్నాకర్, టైక్వాండో సంఘం మెంబర్ గోపీనాయుడు, బ్యాడ్మింటన్ సంఘము శివయ్య, రాకెట్ బాల్ సంఘం ప్రేమ్, రోయింగ్ సంఘం శ్రీధర్, రైఫిల్ షూటింగ్ సంఘం సభ్యులు హిమత్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

రేణిగుంట జూన్ 8 ప్రభాతవార్త



రేణిగుంట మండలం కరకంబాడి తిరుపతి మార్గంలో అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు అన్నమాచార్య కళాశాల వద్ద సుమారు 55 సంవత్సరాల వ్యక్తి నడుచుకుని వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతనిని 108 అంబులెన్స్ లో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు డ్యూటీ డాక్టర్ ధృవీకరించినట్లు పోలీసులు తెలిపారు. మాసిన తెల్ల గడ్డం పింకు రంగు బనీలు ధరించి ఉన్నాడు. అంతకుమించి ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుని ఆచూకీ తెలిసినవారు. రేణిగుంట అర్బన్ సీఐ మొబైల్ నెంబర్ 9491074540, లేదా అర్బన్ ఎస్ఐ మొబైల్ నంబర్ 9440796765. కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

## మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేసిన వారిని శిక్షించాలి

సత్యవేడు, జూన్ 8 ప్రభాతవార్త:



అమరావతి మహిళా రైతులపై అసభ్యకర పదజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సత్యవేడు టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కోరారు. రాజధాని మహిళా రైతుల శీల హననం చేసేలా సాక్షి డిబేట్లో జర్నలిస్టులు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలపై ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రామస్వామికి పలువురు టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాజధాని నిర్మాణంపై దుష్ప్రచారం చేయడం తగదన్నారు. దీనిపై ప్రెస్ కౌన్సిల్‌ఆఫ్ ఇండియా, కేంద్ర, రాష్ట్ర మహిళా కమిషన్లు వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు పరమశివం, మండల మహిళా నాయకురాలు కావేరి, టీడీపీ నాయకులు శశిమోహన్ నాయుడు, రవి, ఆనందయ్య, గురుమూర్తి, సురేంద్రనాథ్‌రెడ్డి, ఆస్పత్రి కమిటీ మెంబరు ధన, అజిత్ పాల్గొన్నారు.

## ఆగ్నేయ గణపతి ఆలయానికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, జూన్ 8 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న నవసంధి వినాయకుల ఆలయాలకు కొత్త హంగులు దిద్దుతున్నారు. ఆదివారం పట్టణంలోని బేరివారి మండపం వద్ద బాలాలయ స్థాపనలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మండపంలో బాలాలయం వద్ద ప్రత్యేక కలశ పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఇక్కడ హోమాలు ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ఆలయాలు, అలాగే గ్రామాల్లోని ఆలయాల్లో ఉత్సవాలకు ఆలయాలకు అభివృద్ధికి ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు. స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి గ్రామోత్సవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారన్నారు. ఈ మేరకు ఉత్సవాలకు ఎక్కువ ప్రాధాన్యత కల్పిస్తూ స్థానిక నాయకులను భాగస్వాముల్నిచేస్తున్నామని వివరించారు. ఆదివారం కలశ స్థాపన గావించి పూజలను ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ ఎస్‌ఎంకె స్వామినాధన్ గురుకుల్, ఎస్‌ఎంకె అచ్చితా గురుకుల్, ప్రధానార్చకులు కరుణా గురుకుల్, సబంధం గురుకుల్, దక్షిణామూర్తి, ఉప ప్రదానార్చకులు రాము, పౌరోహితులు అర్ధగిరి డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి దంపతుల సంకల్పంతో పూజలు ప్రారంభించారు. ఏర్పాట్లును ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి పర్యవేక్షించారు.

## 27నుంచి దర్మరాజుల మహోత్సవాలు

శ్రీకాళహస్తి, జూన్ 8 ప్రభాతవార్త

ఈ నెల 16 నుంచి శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో భారత పఠనం కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు జరుగుతున్నాయి, ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ధర్మరాజుల స్వామి ఆలయంలో భారీ ఎత్తున నిర్వహించే కార్యక్రమాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి లక్షలాది మంది భక్తులు హాజరౌతారు. భారత పఠనంలో ఉదయం పఠనం రాత్రి రంగస్థల కళాకారులచే భోగాతం నిర్వహించటం జరుగుతుంది. ఈ ఏడాది భోగాతం కార్యక్రమాలను ఏర్పేడు మండలం వికృతమాలకు చెందిన చెంచుకృష్ణపిళ్ళై టిం చే రంగస్థల నాటకాలు నిర్వహించుటకు నిర్ణయించారు. కాగా ప్రధాన ఉత్సవాలు ఈ నెల 27 నుంచి జూలై 9 వరకు జరుగనున్నాయి. ఇందుకు ఏర్పాట్లు చేపట్టారు. 27న ధ్వజారోహణం, జూలై 1న ద్రౌపదీ దేవి కళ్యాణోత్సవం, 4న అర్జున తపస్సు, 5న అవుల మల వేయటం, 6న దుర్యోధన దుశ్శాసన వధ, రాత్రి అగ్నిగుండం, 9న పార్వేట ఉత్సవం నిర్వహించబడుతుంది. ఈ మేరకు చిన్నఆలయాల ఇన్‌చార్జి లక్ష్యయ్య పర్యవేక్షణలో ఏర్పాట్లు కు సంబంధించిన నివేదికలను ఇఓ కు సమర్పించారు.

## శ్రీకాళహస్తి పోలీసుస్టేషన్ వద్ద దేశం మహిళల ధర్నా

శ్రీకాళహస్తి, జూన్ 8 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి అర్బన్ పోలీసు స్టేషన్ వద్ద ఆదివారం స్థానిక శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి సారథ్యంలో తెలుగుదేశం మహిళలు ధర్నా నిర్వహించారు. అమరావతికి సంబంధించి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అసభ్యంగా మాట్లాడటాన్ని నిరసిస్తూ పెద్ద ఎత్తున ధర్నా చేసారు. అమరావతిని వేశ్యల రాజధానికి ఓ బాధ్యత గల మాజీ సిఎం వ్యాఖ్యానించటం ఆయనకు మహిళల పట్ల ఉన్న వ్యతిరేక భావానికి నిదర్శనం అని రిషితారెడ్డి ధ్వజమెత్తారు. సనాతన సంప్రదాయమైన దేశంలో మహిళలను దేవతలుగా పూజిస్తారని అలాంటి దేవతలను ఆడబిడ్డలను కించపరుస్తూ ఐదేళ్ళ పాటు సిఎంగా కొనసాగిన నాయకుడు వేశ్యలతో పోల్చుతూ మాట్లాడటం దారుణమన్నారు. రాబోవు రోజుల్లో వైకాపా తగిన మూల్యం చెల్లించుకుంటుందన్నారు. మహిళలతో పెట్టుకుంటే తమ సత్తా ఏమిటో వైపాకాకు జగన్మోహన్‌రెడ్డికి చవిచూపుతారని రిషితారెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా అర్బన్ సిఐ డి.గోపికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు సుమతి, మాజీ అద్యక్షురాల రేణుకమ్మ అనిత, మల్లీశ్వరమ్మ, కృష్ణవేణి పట్టణానికి చెందిన భారీ ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## ఏపీ ఈఏపిసెట్ 2025 ఫలితాలలో నారాయణ విజయ దుందుభి

తిరుపతి విద్య, జూన్ 8 ప్రభాతవార్త



ఏపీ ఈఏపిసెట్ 2025 ఫలితాలలో తమ విద్యార్థులు రాష్ట్ర స్థాయి లో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని డిజీఎం కొండలరావు తెలిపారు. స్థానిక నారాయణ కళాశాలలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఇంజనీరింగ్ విభాగంలో మాండవ్యపురం భానుచరణ్ రెడ్డి 2 వ ర్యాంకు, మణిదీప్ రెడ్డి 7 వ ర్యాంకు, ధనుష్ 59 వ ర్యాంకు, యశ్విత 69 వంటి అత్యుత్తమ ర్యాంకులతో మొదటి పది లోపు రెండు మొదటి 100 లోపు నాలుగు, ఐదు వందల లోపు 14, వెయ్యి లోపు 21 అత్యుత్తమ ర్యాంకులు సాధించారని బైపీసీ విభాగంలో మోనిక 94 వ ర్యాంకుతోపాటు, మొదటి వెయ్యి లోపు తొమ్మిది ర్యాంకులు సాధించారని తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కోర్ డీన్ శ్రీనివాస రావు, డీన్ వేణుగోపాల్, ప్రిన్సిపాల్ సురేష్, అధ్యాపకులు విజయ్ కుమార్, చిట్టిబాబు, దుర్గా ప్రసాద్, అభిషేక్, ఎ జి ఎం గోపి లు అభినందించారు.

# తిరుపతి డివిజన్

## భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం

రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సుధాకర్

చంద్రగిరి, జూన్ 8 ప్రభాతవార్త:



భూసార పరీక్షలు నిర్వహించడం ద్వారానే ఎరువులను వినియోగించాలని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సుధాకర్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని ఐతేపల్లి, ఎం.కొంగరవారిపల్లి గ్రామాలలో ఆదివారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని పంట సాగులో ఆధునిక శాస్త్రీయతపై అవగాహన చెందాలన్నారు. ఇందులో భాగంగా పంట ఉత్పత్తి, నేల ఆరోగ్యం, వనరుల నిర్వహణను మెరుగుపరచడంపై రైతులు దృష్టి సారించాలన్నారు. వ్యవసాయ సాగులో ఇష్టానుసారంగా ఎరువుల వినియోగం చేయడం వలన నష్టం తప్పదన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలను వివరించిన ఆయన వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్రీడా శాస్త్రవేత్త భరత్‌కుమార్, జిల్లా వనరు కేంద్రం వ్యవసాయ అధికారి శశిధర్ రెడ్డి, ఉద్యానవన సహాయకురాలు పవిత్ర, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## అధనపు సామర్థ్యం పెంపుకు 50 శాతం చార్జీల తగ్గింపు

ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ ఎం.చిన్నరెడ్డెప్ప

చంద్రగిరి, జూన్ 8 ప్రభాతవార్త:

గృహ అవసరాలకు వినియోగించే విద్యుత్ సామర్థ్యాన్ని అధనంగా పెంచుకునేందుకు 50 శాతం చార్జీలను తగ్గించనున్నట్లు ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ ఎం.చిన్నరెడ్డెప్ప ఆదివారం ఒప్రకటనలో పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలలో విద్యుత్ వినియోగం పెరిగిందన్నారు. ఇందులో ప్రతి కుటుంబం తమ అవసరాలకు సాధారణంగా 2 కిలోవాట్స్, మూడు కిలోవాట్స్ మాత్రమే తీసుకుంటున్నట్లు వివరించారు. అయితే స్థాయికి మించి (ఏసిలు వినియోగించడం, విద్యుత్ మోటారు వినియోగించడం, టివి, ఫ్రిజ్, వాషింగ్ మెషిన్, ఐరన్ బాక్స్, మిక్సీ, కంప్యూటర్, ల్యాప్ ట్యాప్) విద్యుత్ వినియోగించడం వలన సంబంధిత ట్రాన్స్ ఫార్మర్‌పై అధికంగా భారంపడటంతో తరచూ సమస్యలు తలెత్తుతాయన్నారు. మీ గృహ అవసరాలకు తగిన రీతిన లోడ్ తీసుకోనట్లయితే విజిలెన్స్ తనిఖీలలో భారీగా ఫెనాల్టీలు విధించే అవకాశం వుందన్నారు. ఈ నేపధ్యంలో వినియోగదారుల సౌకర్యార్థం ప్రస్తుతం 50 శాతం తగ్గింపుతో అధనపులోడ్ తీసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు వివరించిన ఆయన సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జూన్ 30 వరకు మాత్రమే ఈ తగ్గింపు అందుబాటులో వుంటుందన్నారు. మరిన్ని వివరాలకు మీ సమీప విద్యుత్ కేంద్రంలో ఏఈలను సంప్రదించాలని సూచించారు.

## ఇందిరా ప్రియదర్శిని మార్కెట్‌లో సోలార్ సిసి కెమెరాలు ఏర్పాటు

తిరుపతి కార్పొరేషన్, జూన్ 8, ప్రభాతవార్త



జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు తిరుపతి టౌన్ డిఎస్పి భక్తవత్సలం ఆధ్వర్యంలో ఈస్ట్ సీఐ శ్రీనివాస్ పర్యావేక్షణలో తిరుపతిలోని ఇందిరా ప్రియదర్శిని మార్కెట్‌లో సోలార్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసారు. రెండు రోజుల క్రితం ఎస్పీ వెజిటుబుల్ మార్కెట్‌లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని సమాచారం రావడంతో పూర్తి స్థాయిలో పరిశీలించారు. మార్కెట్‌లోకి గుర్తు తెలియని వ్యక్తులు కొందరు వచ్చి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని మార్కెట్ వాసులు ఎస్పీ దృష్టి తీసుకువచ్చారు. ప్రజలు చెప్పిన వేంటనే స్పందిన ఎస్పీగారు మార్కెట్‌లోని కీలకమైన ఐదు వివిధ ప్రదేశాలలో సోలార్ సిసి కెమెరాలు అమర్చడం జరిగినది. తిరుపతి లోని ఇందిరా ప్రియదర్శిని వెజిటేబుల్ మార్కెట్లో ఆకతాయలను నిరోధించాలని ఉద్దేశంతో ఎస్పీ అదేశాలతో 5 సోలార్ సీసీ కెమెరాలను వివిధ ప్రదేశాల్లో ఏర్పాటు చేయడం జరిగింది. సోలార్ సీసీ కెమెరాలు నిరంతరం పని చేయటం వల్ల మార్కెట్ లోపల ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఉండడం కోసం ఈ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు చేస్తున్నట్లు మీ దృష్టికి వస్తే వేంటనే డయల్ 112కు కాల్ సెంటర్‌కి కాల్ చేయవలసినదిగా తిరుపతి జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేసారు.

## డయల్ యువర్ కమిషనర్ సమయంలో మార్పు

- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

తిరుపతి కార్పొరేషన్, జూన్ 8, ప్రభాతవార్త



ప్రతి సోమవారం నగరపాలక సంస్థ లో ఉదయం 9.30 నుండి 10.30 గంటల వరకు నిర్వహించే డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం పరిపాలన కారణాల వలన 10.30 నుండి 11.30 గంటల వరకు నిర్వహించనున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఐఏఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా జూన్ 9 వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక యధావిధిగా నిర్వహిస్తామని తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో జూన్ 9వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఫోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 08772227208కి కాల్ చేసి మాట్లాడవచ్చని ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ శ్రీమతి ఎన్.మౌర్య తెలియజేశారు. అర్జీదారులు వినతి పత్రంతోపాటుఆధార్ కార్డు జతపరిచి, పనిచేయు ఫోన్ నంబర్లను పొందుపరచాలని కమిషనర్ తెలిపారు.

## పేరూరులో 4 ఆవులు, బర్రె మృతి

-గేదెలే నా జీవనాధారం...ప్రభుత్వం న్యాయం చేయాలి: పశువు యజమాని

తిరుపతిరూరల్, జూన్ 8 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ పేరూరు గ్రామ పంచాయతీలో 4 పాడి ఆవులు, బర్రె ఆకస్మికంగా మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. లేత జొన్నమొక్కను తినడం వల్ల పాడి గేదెలు మృతి చెందినట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు నిర్ధారించారు. వెన్నుకు రాని లేత జొన్నకర్రలను తిని, మరుసటిరోజున నీరు త్రాగడం వల్ల, తీసుకున్న దాణా విషపూరితం కావడంతో పాడి గేదెలు మృతి చెందినట్లు తెలిపారు. పాడి పశువుల యాజమానికి నష్ట పరిహారం కోసం స్థానిక టిడిపి లేత నాగూరు శ్రీనివాసులు విషయాన్ని ఎమ్మెల్యే పులివర్తి నానికి సమాచారం అందించారు. ఎమ్మెల్యే నాని తక్షణమే స్పందించి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి, పాడి రైతుకు జరిగిన నష్టాన్ని కలెక్టర్‌కు ఫోన్‌లో వివరించారు. మృతి చెందిన పాడి పశువులకు రెవెన్యూ అధికారులు పంచనామా చేసి, పూడ్చి పెట్టారు. మృతి చెందిన ఆవుల ఖరీదు 3 నుండి 4లక్షల రుపాయాల వరకు ఉండవచ్చునని పశువుల సంవర్థక శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక అధికారులు డాక్టర్ మదన్, డాక్టర్ యోగనంద్, విఆర్వో రాఘవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నా జీవనాధారం కోల్పోయా...ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలి

-పశువుల యాజమానులు సిద్దవోలు నాగరాజ, చెంచమ్మ దంపతులు వాపోయారు. గత 20సంవత్సరాలుగా పాడి పశువుల ద్వారానే తన జీవనాధారం కొనసాగుతుందని...ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని వేడుకున్నారు. తన జరిగిన నష్టాన్ని టిడిపి నేత శ్రీనివాసులు ఎమ్మెల్యే నాని దృష్టికి తీసుకెళ్ళారని, తనకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## పేరూరులో కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి దురాక్రమణ

-ఆక్రమిత భూమిలో అక్రమ నిర్మాణాలు

తిరుపతిరూరల్, జూన్08 ప్రభాతవార్త:



తిరుపతి - చంద్రగిరి ప్రధాన రోడ్డు పక్కన కోట్లాది రుపాయాలు విలువ చేసే ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతమైతున్న రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిరుపతిరూరల్ మండలం పేరూరు గ్రామ పంచాయతీ సర్వేనెంబర్ 529లో ఒక ఎకరా ప్రభుత్వ భూమి దురాక్రమణకు గురైతుంది. ఆక్రమిత భూమిలో ఆదివారం నిర్మాణాలు జరుగుతుండగా ఆ భూమి తమకు చెందినదని, కోర్టులో భూ వివాదం నడుస్తుందని ఓ మహిళ అడ్డుకుంది. ఆ మహిళ ఆవేదనను ఎవ్వరు పట్టించుకోకపోవడంతో ఆమె పోలీసు, రెవెన్యూ అధికారులకు ఫోన్‌లో వివరాలు తెలిపిన పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేసారు. రెవెన్యూ అధికారులు స్పందించి కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

## పెట్రోల్ బంకును ప్రారభించిన ఎంఎల్ఏ

తొట్టంబేడు, జూన్ 8 ప్రభాతవార్త



తొట్టంబేడు మండలంలోని కన్నలి వద్ద పెట్రోల్ బంకును స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఆదివారం కన్నలి గ్రామం వద్ద తెలుగుదేశం మండల నాయకుడు కొన్నలి రమేష్‌కు పెట్రోల్ బంకు మంజూరు అయ్యింది. ఈ బంకును శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిధిగా మండల అధ్యక్షుడు మాజీ పాలసొసైటీ అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు చే ప్రారంభోత్సవం చేసారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యానాయుడు పట్టణ పార్టీ కి చెందిన ఢిల్లి బాబు, సుబ్బయ్య, మండల నాయకులు పాల్గొన్నారు.

## జూనియర్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోండి

**- ఏపీ ఆర్జేసీ ప్రిన్సిపల్ శారద భాయ్ చౌదరి**

వెంకటగిరి, జూన్ 8 ప్రభాతవార్త: స్థానిక ఏపీ గురుకుల జూనియర్ బాలుర కళాశాలలో ఇంగ్లీషు, జువాలజీ, ఎకనామిక్స్ సబ్జెక్టుల కొరకు తాత్కాలిక ప్రాతిపదికన నియమించుటకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సి శారద భాయ్ చౌదరి తెలిపారు. అభ్యర్థులు ఆయా సబ్జెక్టులందు పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ కలిగి 50 మార్కులను సాధించి ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు లేదా బయోడేటాను ఈనెల 13వ తేదీ సాయంత్రం 4 గంటలకు కళాశాల ఆఫీసు నందు చేర్చాలని తెలిపారు. అతిథి లెక్చరర్లకు నెలకు 18 వేల రూపాయలు గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. బోధన నైపుణ్యం కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు 8712625075 సెల్ నెంబర్ కు సంప్రదించాలని కోరారు.

## రాజనేని రామానాయుడు ట్రస్ట్‌చే... మహిళ వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయం



చిల్లకూరు, జూన్ 8 ప్రభాతవార్త : మండలం పాలిచర్లవారిపాలెం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న బీబీజాన్ అనే మహిళ వైద్య ఖర్చులకోసం 25 వేల రూపాయలను రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు రాజనేని శ్రీనివాసరావు నాయుడు దాతృత్వంతో ట్రస్ట్ కార్యదర్శి రామయ్య నాయుడు చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా రామయ్య నాయుడు మాట్లాడుతూ పాలిచర్లవాలి పాలెం గ్రామానికి చెందిన బీబీజాన్ అనే మహిళ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఇటీవల ఆపరేషన్ చేయించుకోగా కుట్లు వద్ద గాయం మానకపోవడంతో మరల హాస్పిటల్‌కి వెళ్లి వైద్యం చేయించుకునేందుకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతుండడంతో ట్రస్టు ద్వారా 25వేల రూపాయలు ఆర్థిక సాయం అందించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రాజనేని వెంకటేశ్వర్లు నాయుడు, బాబు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## యోగాతో మానసిక, శారీరక ఉల్లాసం



గూడూరు, జూన్ 8 ప్రభాతవార్త : యోగా వల్ల మానసిక శారీరక ఉల్లాసం పెరుగు తుందని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండా లని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యోగాంధ్ర కార్యక్రమాన్ని తీసుకువచ్చారని ప్రజలందరూ పాల్గొనాలని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పిలుపు నిచ్చారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో పురపాలక సంఘ ఆధ్వర్యంలో యోగ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు ఎమ్మెల్యే వాకర్స్ ప్రజలు యోగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యోగా వల్ల ఆరోగ్య సమస్యలు రావని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యోగాంధ్ర కార్యక్రమాన్ని తీసుకువచ్చారని తెలిపారు. ఈనెల 21 వ తేదీ విశాఖలో ప్రధానమంత్రి మోడీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో 5 లక్షల మందితో యోగా నిర్వహిస్తున్నారని 21వ తేదీ గూడూరులో కూడా యోగా ఈవెంట్ జరుగుతుందని ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. కరోనా కేసులు మళ్లీ వస్తున్నాయని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు పులిమి శ్రీనివాసులు, రహీం శివకుమార్, కట్ట మురళీకృష్ణ, రాజా, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు తీపి కబురు

కోట, జూన్ 8 ప్రభాతవార్త : ఇన్నాళ్లు మండుతున్న ఎండలను సైతం లెక్క చేయకుండా పనులు చేసిన ఉపాధి వేతనదారులకు తీపి కబురు అందింది. కొన్ని నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ పోషణ భారంగా మారడంతో అవస్థలు పడ్డారు. ఈ నేపథ్యంలో 8 వారాలుగా బిల్లుల బకాయిలు విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. కేంద్రప్రభుత్వం నిధులు విడుదల చేసిందని ఏపీఓ పూర్ణిమ తెలిపారు. మరో రెండు మూడురోజుల్లో నిధులు జమ అవుతాయని చెప్పారు.

## కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాలపై... విస్తృత ప్రచారం

కోట, జూన్ 8 ప్రభాతవార్త : బిజెపి అధికారంలోకి వచ్చి ఈ నెల 9వ తేదీకి 11 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రధాని మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు కోరారు. ఆదివారం ఆయన కోటలో విలేఖరులతో మాట్లాడుతూ సేవ- సుపరిపాలన, పేదల సంక్షేమం, వికసిత్ భారత్, సంకల్పం ఆధారంగా పలు కార్యక్రమాలను ఆగస్టు 15వ తేదీ వరకు చేపట్టాలని బిజెపి అధిష్టానం ఆదేశించినట్లు చెప్పారు. మోడీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అమలు చేసిన పథకాలతో పాటు ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరిట మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. దేశాన్ని రక్షించే ఏకైక నాయకుడు నరేంద్రమోడీ అనే విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు.

## ఆటలు ఆడేదెలా...పాఠశాలల్లో క్రీడా మైదానాల్లేవు




కోట, జూన్ 8 ప్రభాతవార్త : వేసవి సెలవులు కొద్దిరోజుల్లో ముగియనున్నాయి. పాఠశాలలు పిల్లలతో సందడిగా మారనున్నాయి. అయితే సాయంత్రం పిల్లలు ఆడుకోవడానికి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్నా సాధన చేయలేని పరిస్థితులు ఉన్నాయి. మండలంలో కోట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, చెందోడులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లలో మైదానాలు లేవు. వేసవి సెలవుల్లో అధికారులు వీటిపై దృష్టి పెట్టలేదు. ఫలితంగా చిన్నారుల క్రీడా వికాసానికి అవరోధంగా మారింది. పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేకపోతే తాము ఏమీ చేయలేమని మరోపక్క గురువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆయా పాఠశాలల పరిధిలో ఆట స్థలాలను కొనుగోలు చేసి విద్యార్థులకు ఆటలు ఆడుకునేందుకు సౌకర్యం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## వైసిపి వారిని అరెస్ట్ చేయాలి

**- మాజీ ఏఎంసీ చైర్మన్ పులికల్లు రాజేశ్వరరావు**



వెంకటగిరి, జూన్ 8 ప్రభాతవార్త : అమరావతికి చెందిన మహిళ రైతులను కిచ్చుపరిచే విధంగా మాట్లాడిన వైసిపి వారిని వెంటనే అరెస్ట్ చేయాలని మాజీ ఏఎంసీ చైర్మన్ పులికల్లు రాజేశ్వరరావు తెలిపారు. అమరావతి మహా రైతులను కించపరిచే విధంగా మాట్లాడేది మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి, ఛానల్ ప్రతినిధి చేయాలని పోలీస్ స్టేషన్లో టిడిపి మహిళ నేతలు తెలియజేశారు. రాజధాని కోసం పోరాటం చేసిన మహిళ రైతులను కొందరు వైసీపీ నాయకులు కించపరిచే విధంగా మాట్లాడాలని తెలిపారు. వైసిపి వారి చానల్లో ఇబ్బందికరంగా మాట్లాడినట్లు చెప్పారు. వైసిపి మహిళలను కించపరిచే విధంగా పోస్ట్ చేశారు తెలుగుదేశం వారిని చంద్రబాబు నాయుడు అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు చంద్రమౌళి రెడ్డి, టిడిపి నాయకులు విశ్వనాథం, నరసింహులు, ఆనంద్ మహిళా నాయకులు, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు గురు ప్రసాద్, జనసేన నాయకులు అనిల్, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జగన్ ప్రోత్సాహంతోనే ఆ ఛానల్లో నీచమైన వ్యాఖ్యలు

**- 24 గంటల్లో జగన్ బహిరంగ క్షమాపణ చెప్పాలి - తెలుగు మహిళలు డిమాండ్**

గూడూరు, జూన్ 8 ప్రభాతవార్త: జగన్ ప్రోత్సాహంతోనే ఆ ఛానల్లో నీచమైన వ్యాఖ్యలు చేసారని 24 గంటల్లో జగన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని తెలుగు మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణిరెడ్డి అన్నారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ అమరావతి రాజధానిపై వైసీపీ ఛానల్లో జర్నలిస్ట్ ముసుగులో ఉన్న ఇద్దరు వ్యక్తులు అతి జుగుప్సాకర వ్యాఖ్యలు చేసిన ఘటన కేవలం సైకో జగన్ ప్రోత్సాహంతోనే జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో చరిత్ర ఉన్న,ఐదు కోట్ల మంది ప్రజలకు కలల రాజధానిగా నిర్మితమవుతున్న అమరావతిపై అనుక్షణం విషం చిమ్మేందుకు ప్రయత్నం చేస్తున్న జగన్మోహనరెడ్డిని రాష్ట్రం నుంచి బహిష్కరిం చాలని కోరారు. జగన్మోహనరెడ్డి రాష్ట్రాన్ని గంజాయి హబ్‌గా మార్చి యువత జీవితాలు నాశనం చేస్తే, కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హోం మంత్రి అనిత గంజాయి నిర్మూలనకు కృషి చేస్తుంటే, ఇటీవల జగన్ గంజాయి ముఠాకు మద్దతుగా వెళ్ళటం అతని సైకో మనస్తత్వానికి ప్రత్యక్ష నిదర్శనం అన్నారు. మహిళలను తీవ్రంగా అవమాన పరిచేలా తన చానల్లో వ్యాఖ్యలు చేయించిన జగన్మోహన్ రెడ్డి రోడ్డుపై కనిపిస్తే రాష్ట్ర మహిళలు చెప్పుతో కొట్టే పరిస్థితి వచ్చిందన్నారు. 24 గంటల్లో జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలను దేవతలుగా పూజించే సంస్కృతిని అనుసరించే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహిళలను గౌరవించలేని జగన్ వేస్ట్ అన్నారు. సమాజంలో ఆడవారిని గౌరవించడం చేతకాని వాడు నీచుడితో సమానం అన్నారు. టీడీపీది మహిళలను గౌరవించే సంస్కృతి అని, ఇటీవల వైఎస్ భారతిపై వ్యాఖ్యలు చేసిన కిరణ్ అనే నేతను టీడీపీ నుంచి సస్పెండ్ చేసి పోలీస్ కేసు పెట్టి జైలుకు పంపించామన్నారు.జగన్ గత 5సంవత్సరాల కాలంలో చేసిన అవినీతిపై ఇప్పుడు విచారణ జరుగుతుంటే ఈ విషయం నుండి రాష్ట్ర ప్రజల దృష్టి మళ్లించేందుకు ఇంత నీచానికి దిగజారాడు అని అన్నారు. సాక్షి ఛానల్ సాక్షిగా మహిళలను అవమానపరిచిన వారిద్దరిపై తక్షణమే కేసు నమోదు చేసి జైలుకు పంపాలని 1వ పట్టణ పోలీసు స్టేషన్ నందు పిర్యాదు చేయడం జరిగింది. అలాగే వారిపై చర్యలు తీసుకోవాలని తిరుపతి ఆఫీసు నందు కూడా పిర్యాదు చేయడం జరిగింది. అనంతరం సాక్షి దినపత్రికను తగలబెట్టడం జరిగింది. సాక్షి మీడియాలో మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా కమిషన్, హోమ్ మినిస్టర్, ఎస్సి కమిషన్‌ని కూడా పత్రిక ముఖంగా తెలుగు మహిళలు కోరారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకురాలు గుండాల లీలావతి పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు గుండాల శ్రీదేవి, మాజీ కౌన్సిలర్ కల్పన, నియోజకవర్గ కార్యదర్శి చెన్నూరు అంకమ్మ, పట్టణ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి సుధ, రాజేశ్వరీ పాల్గొన్నారు.

## పల్లెపండుగ నిధుల కోసం నిరీక్షణ- కొత్త పనులు ప్రారంభానికి చిక్కులు



కోట, జూన్ 8 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం కొలువుతీరాక పల్లెదారులపై ప్రత్యేకంగా దృష్టి సారించి అభివృద్ధి చేసింది. గ్రామీణులకు, రైతులకు రవాణా కష్టాలు తీరాయి. ప్రధానంగా కోట రోడ్డును బాగు చేసి కూటమి నాయకులు శభాష్ అనిపించుకున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా సంబంధిత బిల్లులు మంజూరు కాకపోవడంతో చిక్కులు తలెత్తుతున్నాయి. ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టాల్సిన పంచ ప్రాధాన్య పనులపై ప్రతికూల ప్రభావం పడుతుంది. కష్టపడి అప్పులు చేసి ఎన్ఆర్ఇజిఎస్ కింద తెలుగు తమ్ముళ్లు రోడ్ల పనులు పూర్తి చేశారు. బిల్లులు రాకపోవడంతో అష్టకష్టాలు పడుతున్నారు. కోట మండలంలో 2.70 కోట్ల నిధులు ఈ రోడ్ల కోసం మంజూరయ్యాయి. కానీ, రోడ్డు పనులు సకాలంలో పూర్తి చేసినా ఎన్ఆర్ఇజిఎస్ గ్రాంట్ రాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామీణ రహదారుల అభివృద్ధిని పూర్తిగా గాలికొదిలేసింది. లింకు, డొంక మార్గాలు సైతం పూర్తిగా రూపుకోల్పోయి రాకపోకలకు నరకం కనిపించేది. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక పల్లె ప్రగతిపై దృష్టి సారించింది. సిసి రోడ్లు, కాలువల నిర్మాణాలు పూర్తి చేసింది. అందులో భాగంగా గత ఏడాది ఆగస్టు 23న జిల్లా వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించి చేపట్టాల్సిన పనులకు అధికారుల ఆధ్వర్యంలో ఆమోదం తీసుకున్నారు. అక్టోబర్ 14 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించిన పల్లెపండుగ వారోత్సవాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అనుసంధానం నిధులతో మంజూరుకు ఆమోదం తీసుకుని పనులు చేపట్టారు. ఈ విషయంపై కోట పంచాయతీరాజ్ ఏఇ కిరణ్‌కుమార్‌ను 'ప్రభాతవార్త' వివరణ కోరగా, కోట మండలానికి 2.70 కోట్లు ఎన్ఆర్ఇజిఎస్ కింద మంజూరయ్యాయని, కొంత మేరకు బిల్లులు మంజూరైనట్లు చెప్పారు.

## టిటిడి ఇంజనీరింగ్ అధికారులు... స్థపతులచే ఆలయాల పరిశీలన



కుప్పం, జూన్ 8 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం నియోజకవర్గంలో ఉన్న 141 గ్రామదేవతల ఆలయాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించిన విషయం విదితమే. సిఎం ఆదేశాలతో టిటిడి బోర్డు సభ్యుడు వైద్య ం శాంతారాం ఆలయాల అభివృద్ధికి సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి)కి లేఖ రాశారు. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఈ గ్రామీణ ఆలయాలను 33కోట్లతో అభివృద్ధికి ప్రతిపాదనలు పంపారు. ఈనేపథ్యంలో శని, ఆదివారాల్లో టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, టిటిడి ధర్మ ప్రచార పరిషత్, టిటిడి ఇంజనీరింగ్ విభాగం అధికారులు, స్థపతులు కుప్పం మండలంలో ఉన్న గ్రామదేవతల ఆలయాలను పరిశీలించారు. ఈసందర్భంగా టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం మాట్లాడుతూ సిఎం ఆదేశాలతో కుప్పం ప్రాంతంలోని ఆలయాల అభివృద్ధికి టిటిడి ద్వారా నిధుల మంజూరుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రానున్న టిటిడి పాలకమండలి సమావేశంలో ఈ నిధుల మంజూరుపై పాలకమండలి తగు నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

## మెడికల్ కిడ్స్ పంపిణీ చేసిన స్వామి వివేకానంద

**- వ్యవసాయ వ్యవస్థాపక అధ్యక్షులు ప్రకృతి కుమార్**



వెంకటగిరి, జూన్ 8 ప్రభాతవార్త : స్థానిక ప్రభుత్వాసుపత్రి వైద్య సిబ్బందికి స్వామి వివేకానంద యువ సైన్యం అధ్యక్షులు ప్రకృతి కుమార్ మెడికల్ కిట్లను అందజేశారు. వైద్య సిబ్బందికి మెడికల్ కిట్లు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## బాల్యవివాహాన్ని అడ్డుకున్న ఎస్సై, సిడిపిఓ

బాలాయపల్లి, జూన్ 8 ప్రభాతవార్త : మండలంలోని సుబ్రహ్మణ్యం గ్రామంలో మైనర్ బాలికకు వివాహం చేస్తుండగా సమాచారం అందడంతో ఎస్సై కామినేని గోపి సిడిపివో శంషాద్ బేగం వెళ్లి అడ్డుకున్నారు. తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వివాహాన్ని నిలిపివేశారు. బాల్య వివాహాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై కామినేని గోపి హెచ్చరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే సమాచారం ఇవ్వాలని కోరారు.

## కాంగ్రెస్ పార్టీకి ఊపు లభిస్తుందా!

**- నేడు చిత్తూరులో పిసిసి అధ్యక్షురాలు షర్మిలారెడ్డి సమావేశం**

చిత్తూరు, జూన్ 8 ప్రభాతవార్త: సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి ఆంధ్రప్రదేశ్‌లో సర్వం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం ఉనికి కోసం పోరాడుతున్నది. రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా నిర్వీర్యం అయ్యింది. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీని మళ్ళీ జనాల్లోకి తీసుకెళ్ళి పటిష్టం చేయాలని నిర్ణయించి కాంగ్రెస్ అధిష్టానం పిసిసి అధ్యక్షురాలిగా షర్మిలా రెడ్డిని నియమించడంతో ఆమె సోమవారం చిత్తూరు వచ్చి జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించనున్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్ ఆధ్వర్యంలో బాన్స్ హోటల్‌లో జరిగే ఈ కార్యవర్గ సమావేశానికి జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు అందరు హాజరు కానున్నారు. ఈ సమావేశంలో పిసిసి అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులకు దిశా నిర్దేశం చేసి ప్రభుత్వంపై పోరాటం చేయడానికి సన్నద్ధులను చేసి కాంగ్రెస్ క్షేత్ర స్థాయిలో మళ్ళీ పుంజుకోవడానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి వెళ్ళనున్నారు.

## అంత ఈజీ కాదు బాస్ !

**- తెదేపాలో చేరాలంటే కేంద్ర కార్యాలయం గ్రీన్‌సిగ్నల్ కీలకం**

కుప్పం, జూన్ 8 ప్రభాతవార్త : జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, సిఎం చంద్రబాబునాయుడు తెలుగుదేశం పార్టీ సంస్థాగత పరంగా కీలక నిర్ణయం తీసుకున్నారు. తెదేపా గూటివైపు రావాలనుకునే ఇతర పార్టీల నాయకులకు ఇకపై అంత సులువుగా తెలుగుదేశం పార్టీ ద్వారాలు తెరచుకోవు. ఈమేరకు సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పార్టీ శ్రేణులకు స్పష్టమైన సమాచారం అందించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు, జోనల్ కోఆర్డినేటర్లు, పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు, ఎంపిలు, శాసనసభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, నియోజకవర్గాల పరిశీలకులకు పార్టీ అధిష్టానం ఆదేశాలపై ప్రకటన వెలువరించారు. ఇతర పార్టీల్లో నుంచి తెలుగుదేశం పార్టీలో చేరాలనుకునేవారి వివరాలు ఇకపై తప్పకుండా పార్టీ కేంద్ర కార్యాలయానికి తెలియజేయాలని ఆదేశించారు. అనంతరం పార్టీ కేంద్ర కార్యాలయం పార్టీలో చేరే ఇతర పార్టీ నాయకుల గురించి పూర్వాపరాలు విచారణ చేయించిన అనంతరం కేంద్ర కార్యాలయం చేర్చుకోవాలా, వద్దా అనే అంశంపై గ్రీన్ సిగ్నల్ ఇస్తేనే ఇతర పార్టీ నేతలను పార్టీలోకి చేర్చుకునే అవకాశం ఉంటుంది. ఒకవేళ కేంద్ర కార్యాలయం వద్దు అనుకుంటే తెదేపాలోకి నో ఎంట్రీ అన్నమాట. ఈ లెక్కతో పార్టీలో ఎవరు, ఎక్కడ, ఎలాంటివారు, ఏ పార్టీ నాయకులు తెలుగుదేశంలో చేరేందుకు వస్తున్నారు అనే అంశంపై పార్టీ అధిష్టానం కూడా దృష్టి సారించనుంది. సిఎం చంద్రబాబునాయుడు నిర్ణయంపై ఉమ్మడి జిల్లాలోని తెదేపా శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

## అంచనాలకు మించి భక్తుల రద్దీ -దర్శనానికి నాలుగైదు గంటలు



కాణిపాకం, జూన్ 8 ప్రభాతవార్త: సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి అలయ దర్శనార్థం అంచనాలకు మించి అశేషంగా తరలివస్తున్న భక్తులతో ఆదివారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. గత రెండు వారాలుగా వేసవి సెలవుల కారణంగా ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ కొనసాగుతోంది. ఈనేపథ్యంలో శని, ఆదివారాలు,వరుస సెలవు రోజులు,వారంతపు రోజులు కావడంతో పాటు విద్యాసంస్థలు,పాఠశాలలకు వేసవి సెలవులు మరో రెండు మూడు రోజుల్లో ముగుస్తుండడంతో కాణిపాకం ఆలయ దర్శనార్థం భక్తులు వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చారు.అలాగే ఆలయంలో ఆదివారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించడంతో ఈకార్యక్రమంలో పాల్గొనేందుకు భక్తులు పెద్దఎత్తున ఉభయ తెలుగు తరలివచ్చారు. అలాగే రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని భక్తులతో పోటెత్తింది. శని, ఆదివారాల్లో ఆలయంలో రద్దీ కొనసాగుతోంది. రద్దీ కారణంగా ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు.అలాగే ఆలయ మాడీ వీధులు, పరిసరాలన్ని కిక్కిరిసిపోయాయి. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లలో సుమారు నాలుగు గంటలకు పైగా వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. దీనితో భక్తులకు త్వరితగతిన స్వామిదర్శనం కల్పించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఇదిలా వుండగా కాణిపాకం ఆలయ దర్శనార్థం అశేషంగా తరలివచ్చిన భక్తుల వాహనాలతో పార్కింగ్ స్థలాలన్ని కిటకిటలాడాయి.పార్కింగ్ స్థలాలు నిండిపోవడంతో కాణిపాకం పరిసర గ్రామాల వద్ద పార్కింగ్ చేసుకోవాల్సి వచ్చింది.ఆదివారం సుమారు 30 వేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అంచనా.

## శివయ్య సేవలో రిజర్వ్‌బ్యాంక్ డెప్యూటీ గవర్నర్



శ్రీకాళహస్తి,జూన్ 8 ప్రభాతవార్త : దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం రిజర్వ్ బ్యాంకు డెప్యూటీ గవర్నర్ వి.టి రవిశంకర్ కుటుంబ సభ్యులతో హాజరయ్యారు.స్వామి అమ్మవార్ల దర్శనం తరువాత వారికి మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో ఎఇఓ సతీష్‌మాలిక్ ఎపిఆర్ఓ రవి, ఇండియన్ బ్యాంకు మేనేజర్ హరికృష్ణ,యోగేంద్ర తదితరులు ఉన్నారు.

## కాణిపాకం ఆలయానికి రెండు లక్షలు విరాళం



కాణిపాకం, జూన్ 8 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారి దేవస్థానంలో అమలవుతున్న అభివృద్ది కార్యక్రమాలకు ఓ భక్తుడు ఆదివారం రాత్రి రెండు లక్షల రూపాయలను విరాళంగా అందించారు. ఈమేరకు హైదరాబాద్‌కు చెందిన అగ్ని సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ అధినేత శివరాజు అనే భక్తుడు ఆలయ అభివృద్ధికి రెండు లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమొత్తాన్ని దాతలు కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఏఈఓ రవీంద్రబాబుకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజీనాయుడు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు ఉపాధికి ప్రణాళికలు: సుధీర్‌రెడ్డి



శ్రీకాళహస్తి,జూన్ 8 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని సర్వతోముఖాభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గ అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు సాధిస్తున్నట్లు వివరించారు. శ్రీకాళహస్తి పట్టణ అభివృద్ధికి తుడా నిధులను సాధించుటకు తుడా చైర్మెన్‌తో చర్చిస్తున్నామన్నారు. ముఖ్యంగా ఆసుపత్రిలో ఈద్‌గాహ్‌ల, అక్కడ చక్కటి ఆహ్లాదకర వాతావరణం కల్పించుటకు పార్కులు అబివృద్ధి కృషి చేస్తున్నామని వివరించారు. ముఖ్యంగా కేంద్రం నుంచి రూ.230కోట్లు నిధులు సాధించి ఈ మున్సి పాలిటిని పుణ్యక్షేత్రంలో ఉండటంతో సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు.

**అందరికి ఎంజాయ్‌మెంట్ సర్టిపికేట్లు:**

శ్రీకాళహస్తిలో నిరుపేదలు నిర్మించుకున్న ఇళ్ళకు ఎంజాయ్‌మెంట్ సర్టిఫికేట్లను రెండు మూడు నెలల్లో అందించుటకు కృషి చేస్తున్నట్లు ఎంఎల్ఏ వివరించారు. పట్టణంలోని నివాసముం టున్న నిరుపేదలకు ఎంజాయ్‌మెంట్ సర్టిఫికేట్లు అందించాలని తన తండ్రి గోపాలకృష్ణారెడ్డి ప్రయత్నించారని, కానీ అది సఫలం కాలేదని ఆయన కలలను సాకారం చేయటానికి ఎంజాయ్‌మెంట్ సర్టిఫికేట్లు ఇప్పించేందుకు రెవెన్యూ అధికారులతో చర్చిస్తున్నట్లు వివరించారు. ఇక రాజీవ్‌నగర్ ప్రక్షాళన కార్యక్రమాలు చేపట్టను న్నట్లు తెలిపారు. ఇక్కడ సమూలంగా ప్రక్షాళన చేసి అర్హులైన అందరికి అందిస్తామన్నారు. టిడ్కో ఇళ్ళను మూడు నాలుగు నెలల్లో ఎవరైతే సొమ్ములు చెల్లించి ఉన్నారో అందరికి అందిస్తామని సుధీర్‌రెడ్డి వివరించారు.

**నిరుద్యోగులకు ఉపాధి:**

శ్రీకాళహస్తిలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించుటకు ప్రణాళికలు రూపొందించామన్నారు. కేంద్రం నుంచి పథకాన్ని సాధించామని సుమారు 200 నుంచి 300 మందికి తిరుపతి కేంద్రంగా మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వబడుతుందన్నారు.వారికి వారి శ్రద్దను బట్టి స్వయం ఉపాదికి రూ.1.75 లక్షల నుంచి 40లక్షల వరకు రుణ సదుపాయంకల్పిస్తామన్నారు. నియోజావర్గంలోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలతో పాటు ఎన్నో పరిశ్రమలు వస్తున్నాయని వాటిలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు చర్యలు తీసుకుంటున్నామని సుధీర్‌రెడ్డి వివరించారు. నిరుద్యోగుల తో పాటు ఎవరైతే వ్యాపారాలు చేసుకోవాలనే శ్రద్ద ఉంటుందో వారికి శిక్షణ ఇవ్వటానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.